
వార్త
ఆదివారం
7 ఆగస్టు, 2022
స్నేహమెంతో మధురం

# బాలయ్య జోడీగా సోనాక్షి సిన్హా?



**బాలీవుడ్‌లోని** అందాల భామల్లో సోనాక్షి సిన్హా ఒకరు. సినిమా నేపథ్యాన్ని కలిగిన కుటుంబం నుంచి వచ్చిన సోనాక్షి తన టాలెంట్‌తోనే నిలబడటా కి ప్రయత్నిస్తూ వచ్చింది. బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చి అప్పుడే పుష్కర కాలమవుతోంది. ఈ పన్నెండు ఏళ్లలో ఆమె హిందీ సినిమాలకి మాత్రమే ప్రాధాన్యమిచ్చింది. తమిళంలో రజనీకాంత్ సరసన నాయికగా సోనాక్షి 'లింగా' సినిమా చేసింది. ఆ సినిమాలో గిరిజన యువతిగా ఆమె పాత్ర ప్రేక్షకులకు కనెక్ట్ అయింది. ఆ తరువాత ఆమె తెలుగు సినిమాలో కూడా చేస్తుందని అనుకున్నారుగానీ ఇంతవరకూ చేయలేదు. తాజాగా బాలయ్య సరసన ఆమె చేయనుందనే టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం బాలయ్య-గోపీచంద్ మలినేనితో ఒక సినిమా చేస్తున్నాడు. ఈ సినిమా తరువాత ఆయన అనిల్ రావిపూడితో ఒక సినిమా చేయనున్నాడు. ఇది తండ్రీ కూతుళ్ల ఎమోషన్స్ ప్రధానంగా సాగుతుందని టాక్.. కూతురు పాత్రలో శ్రీలీలను తీసుకున్నారు. కథానాయికగా సోనాక్షి సిన్హా ఎంపిక జరిగినట్లు సమాచారం.

---

తారాతీరం

# చిరు సినిమాలో రవితేజ!

చిరంజీవి కథానాయకుడుగా దర్శకుడు బాబీ ఒక సినిమాను రూపొందిస్తున్నాడు. ఈ సినిమాకి 'వాల్తేర్ వీరయ్య' అనే టైటిల్‌ను ఖరారు చేసే ఆలోచనలో ఉన్నారు. జాలరుల గూడెం నేపథ్యంలో ఈ కథ ఉంటుందని సమాచారం. ఇప్పటికే ఈ చిత్రం షూటింగు మొదలైపోయింది. చిరంజీవి సరసన నాయికగా శ్రుతిహాసన్ అలరించనుంది.

ఈ సినిమాలో రవితేజ ఒక ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నాడు. చిరంజీవికి సవతి తమ్ముడుగా రవితేజ ఇందులో కనిపించనున్నాడని టాక్. అంటే తండ్రి ఒకరే; కానీ తల్లులు వేరు. రవితేజ పాత్రను కూడా బాబీ డిఫరెంట్‌గా డిజైన్ చేసాడని అంటున్నారు.

రవితేజ సరసన కేథరిన్ కనిపించనున్నట్లు వినికిడి. చిరంజీవి అన్నయ్య అని పిలిచే రవితేజ, ఈ చిత్రంలో ఆయనకి తమ్ముడి పాత్రలోనే చేస్తుండటం విశేషం.



ఆదివారం వార్త
sunmagvaartha@gmail.com
7 ఆగస్టు, 2022

## మంచి ముత్యాలు

ప్రేమ కావాలని ఆజ్ఞాపించకు. అది అలా దొరకదు. ప్రేమించడం ప్రారంభించు, నీవు ప్రేమించబడతావు.

\- రాజాజీ

## విషయ విశేషం

గ్రీన్ బీడ్స్ నగలు.4
'సంఘీ'భావం....5
మూసీకి ఆక్రమణల నుంచి మోక్షం లేదా?
ప్రపంచంలో ఎత్తైన జలపాతం ఏంజెల్..6
కవర్ స్టోరీ..8
స్నేహమెంతో మధురం
ఈవారం కవిత్వం..12
కాంతులీనేదాకా..
స్వార్థమే దుర్గుణాలకు మూలం..14
సహస్రాధిక మునులు తపస్సు చేసిన
'మునిగిరి'.. 18
కథ.. 20
ఇరుగు పొరుగు
కేరాఫ్ గుడి మెట్లు..24
చిత్రభారతి.. ..30
సినిమా విజేతలకు అభినందన స్వాగతం

ఇంకా..
పుస్తక సమీక్ష
మొగ్గ
వారఫలం
కాసేపు సరదాగా నవ్వుకోండి
వగైరా..వగైరా..




# తాజా వార్తలు

## వధూవరుల అంగీకార పత్రం



భార్యాభర్తలిద్దరూ కలకాలం ఏ అరమరికలూ లేకుండా సుఖసంతోషాలతో జీవించేలా పెళ్లిళ్ల లో వారి చేత శాస్త్రోక్తంగా కొన్ని ప్రమాణాలు చేయిస్తారు. అయితే ఈ మధ్యనే వైవాహిక జీవితంలోకి అడగుపెట్టిన అసోం అమ్మాయి శాంతి- కొన్ని క్షణాల్లో మెడలో తాళి కట్టబోయే అబ్బాయి మింటుకి కొన్ని షరతులు పెట్టింది. వాటిని అగ్రిమెంట్‌గా రాయించి పెళ్లి పీటలపైనే అతనితో సంతకాలు పెట్టించుకుని మరీ తాళి కట్టించుకుంది. తమ వైవాహిక జీవితంలో ఎలాంటి పొరపొచ్చాలకీ తావులేకుండా ఉండేందుకే ఈ చిరు జాగ్రత్త తీసుకున్న శాంతి, వరుడు మింటూకి ఏం చెప్పిందంటే..'నెలకొక్కసారే పిజ్జా తినాలి, ఎక్కువగా ఇంటి ఆహారానికే ప్రాధాన్యమివ్వాలి, లేట్‌నైట్ పార్టీలూ ఒకే- అయితే అది తనతో అయితేనే, ఫిట్‌నెస్ కోసం ఇద్దరం రోజూ జిమ్‌కి వెళ్లాలి, ప్రతి ఆదివారం ఉదయం బ్రేక్‌ఫాస్ట్ నువ్వే (వరుడు) సిద్ధం చేయాలి, నేను బాగా రెడీ అయినప్పుడూ పార్టీలకు వెళ్లినపుడూ ప్రత్యేక సందర్భాల్లోనూ కాదనకుండా ఫొటోలు తియ్యాలి, ప్రతి 15 రోజులకీ షాపింగుకి తీసుకెళ్లాలి..'ఈవిధంగా పెళ్లి కూతురు పెట్టిన కండిషన్లకు వెంటనే ఒప్పేసుకున్న ఆ అబ్బాయి తన భార్య రోజూ చీరే ధరించాలి అని శాంతికి షరతు పెట్టాడు. ఆమె కూడా అందుకు అంగీకరించి సంతకం పెట్టేసింది. ఈ నిబంధనలు ఫన్నీగా అనిపిస్తున్నా..వాటికి వాళ్లు కట్టుబడి ఉంటే మాత్రం సంసారంలో గొడవలు తగ్గవచ్చు..

### పావురాలకో అపార్ట్‌మెంట్



నగరాల్లో పావురాలూ, పక్షులూ అపార్ట్‌మెంట్ బాల్కనీల్లో, సన్‌షేడ్స్‌పైనే ఉంటున్నాయి. అయితే వాటి వల్ల పలు సమస్యలు తలెత్తుతుండడంతో చాలామంది వాటికి ధాన్యం వేయట్లేదు, నీళ్లూ పెట్టట్లేదు. అది గమనించిన జైపుర్ వాసి రాధే శ్యామ్ రెండు లక్షల రూపాయలు ఖర్చుపెట్టి పావురాల కోసం ఆరు అంతస్తుల అపార్ట్‌మెంట్‌ను నిర్మించాడు. దాదాపు రెండువేల పక్షులు ఉండేందుకు వీలుగా చిన్నచిన్న గూళ్లలాంటి నిర్మాణంతో ఆ భవనాన్ని నిర్మించిన శ్యామ్ దానికి పక్షితీర్థం అని పేరు పెట్టాడు. ఈ మధ్యనే నిర్మాణం పూర్తి అయిన ఆ భవనంలోని ప్రతి అంతస్తులో ఆయన రోజూ ధాన్యం, నీళ్లు పెడుతున్నాడు. దాంతో పావురాలూ, ఇతర పక్షులూ నివాస సముదాయాలవైపు వెళ్లకుండా పక్షి తీర్థంలోనే ఆవాసం ఏర్పాటు చేసుకుంటున్నాయి.












# గ్రీన్ బీడ్స్ నగలు



రోజుకో జ్యుయెలరీ ట్రెండ్ మార్కెట్లోకి వస్తున్న సమయంలో నగల తయారీకి ఎన్ని రకాలున్నా సరిపోవంటే అతిశయోక్తి కాదు. కనుకనే రాళ్లను రత్నాలుగా చెక్కడమే కాదు పూసలుగానూ మారుస్తున్నారు. ఆభరణాలు చేస్తున్నారు. రత్నం లాంటి ఆ రాయి పేరు 'ఆనిక్స్' అయితే దాన్నుంచి వచ్చిన పూసల నగలకు మరో పేరే గ్రీన్స్ బీడ్స్ జ్యుయెలరీ.

అలాగని పూసల నగలు కొత్త కాదు. ఒకప్పుడు ముత్యాలు పగడాలతో చేసిన నగలే తెలుసు. పచ్చలూ, కెంపులూ వంటి రత్నాల్నీ పూసలుగా చెక్కి హారాలుగా గుచ్చేవారు కానీ ఖరీదైన ఆ నగలు సంపన్నులకి, రాజకుటుంబీలకే పరిమితమ య్యేవి. అందుకే ఇప్పుడు కాస్త తక్కువ రకం ఆనిక్స్ వంటి సహజాతి రత్నాన్ని పూసలుగా మలిచి హారాలుగా గుచ్చుతున్నారు.



వాటికి రాళ్లు పొదిగిన బంగారు లాకెట్లతో సొగసులద్దేస్తున్నారు నేటి డిజైనర్లు. వజ్రాలు, కెంపులు, పచ్చలు, నీలాలు వంటి జాతి రత్నాలున్నట్లే నేలపొరల్లో అగేట్, ఆనిక్స్, జేడ్.. వంటి సహజాతి రత్నాలు ఉన్నాయి. వీటిల్లో చాలావరకు సిలికేట్ ఖనిజాలే. నలుపు నుంచి తెలుపు వరకు అన్ని రంగుల్లోనూ ఆనిక్స్ రాళ్లు దొరుకుతాయి. అయితే సహజంగా దొరికిన ఆనిక్స్ రాళ్లలోకి కృత్రిమ రంగుల్ని చొప్పించడం ద్వారా మరిన్న రంగులు సృష్టిస్తున్నారు.

కొందరైతే కాల్సైట్ రాళ్లనీ సాదా క్వార్ట్జ్ రాళ్లనీ సానబెట్టి రంగులద్ది ఆనిక్స్‌గా చెబుతుంటారు. పూర్వం నుంచీ ఇవి వాడుకలో ఉన్నప్పటికీ మన దగ్గర మాత్రం ఈ మధ్యే వీటికి క్రేజ్ బాగా పెరిగింది. చిన్నా పెద్దా సైజుల్లో క్రిస్టల్స్ లేదా పూసల మాదిరిగా చెక్కి రెండు లేదా నాలుగైదు వరుసల్లో గుచ్చుతు న్నారు. ఆపై వాటికి కుందన్, మీనాకారి, టెంపుల్ డిజైన్లలో చేసిన బంగారు లాకెట్లను అమర్చి హారాలు, నెక్లెస్‌లుగా రూపొందించడంతో ఇతరత్రా నగల్లానే ఇవీ అందరినీ ఆకర్షిస్తున్నాయి. ఆనిక్స్‌లో అన్ని రంగులూ ఉన్నప్పటికీ ఆకుపచ్చ రంగుని చొప్పించిన ఆనిక్స్ బీడ్స్‌దే హవా. ఈ రాళ్లపూసల హారాలు అందంతో పాటు ఆడంబ రంగానూ కనిపిస్తున్నాయి. అందుకే వెరైటీగా ఉంటుందని ఈ బీడ్స్ జ్యుయెలరీతో ముస్తాబై వేడుకలకి హాజరవుతున్నారు మహిళలు.



'సంఘీ' భావం



# మూసీకి ఆక్రమణల నుంచి మోక్షం లేదా?

**మూసీ** నదికి చిన్నపాటి వరద వచ్చిన పరిసరాలు ముంపునకు గురౌతున్నాయి. సుమారు రెండు దశాబ్దాల నుంచి మూసీ పరివాహక ప్రాంతాల్లో ఆక్రమణలు జోరుగా సాగుతున్నాయి. ఒకప్పుడు నగర ప్రజలకు తాగునీరు అందించే మూసీ నది సరైన నిర్వహణ లేకపోవడంతో మురికికూపంగా తయారైంది. డ్రైనేజీ వ్యవస్థతో మూసీ కలిపిపోవడం, పరీవాహక ప్రాంతాల్లోని పరిశ్రమలు కలుషిత నీటిని వదలడంతో భరించరాని దుర్వాసన వెలువడుతోంది. సుమారు దశాబ్దకాలం నుంచి మూసీపై ఆక్రమణలను తొలగిస్తామని ప్రభుత్వాలు, అధికారులు ప్రకటనలు చేస్తున్నప్పటికీ ఆచరణలో మాత్రం పెట్టలేకపోతున్నారు. కేవలం సర్వేలు నిర్వహిస్తూ కాలయాపన చేస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు ఆరేడు సర్వేలు జరిగాయి. ప్రతి సర్వేలోను మూసీ నది పరివాహక ప్రాంతాల్లో ఆక్రమణల సంఖ్య అత్యధికంగా ఉన్నట్లు వెల్లడైంది. అధికారులు నిర్వహించిన సర్వేల్లో సుమారు 8,529 ఆక్రమణలు ఉన్నట్లు తేలింది. ఈ ఆక్రమణలు నది గట్టుపైనే కాకుండా ఏకంగా నదీ గర్భంలో కూడా నిర్మించారు. అధికారులు నోటీసులు జారీ చేసి ఆక్రమణల తొలగింపు కార్యక్రమం చేపట్టడానికి రంగం సిద్ధం చేసిన ప్రతిసారీ రాజకీయ వత్తిడిలు రావడంతో పట్టించుకోవడం లేదు. రాజకీయ నేతల అండదండలు ఉండటంతో ప్రతి ఏటా ఆక్రమణలు కొనసాగుతూనే ఉన్నాయి. నది గట్టు వద్ద సుమారు 500 మీటర్ల మేర ఎటువంటి కట్టడాలు ఉండకూడదని నిబంధనలు ఉన్నాయి. అయితే చాలా ప్రాంతాల్లో నదిలోకి చొచ్చుకుని వచ్చి పక్కా కట్టడాలను నిర్మించి బస్తీలు ఏర్పాటు చేసుకున్నారు. రెండు సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయినా మూసీకి వరదలు రావడం చాదర్‌ఘాట్, ముసారాంబాగ్ వంతెనలు మూసివేయడం సర్వసాధారణంగా మారింది. 1908లో మూసీ నదికి భారీ వరదలు వచ్చాయి. ఆ సమయంలో భారీ వరదలు మూసీనదికి వచ్చి పరిసర ప్రాంతాలను జలమయం చేసింది. మూసీనది పరీవాహక ప్రాంతంలో ఆక్రమణలతో పాటు ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున పేరుకుపోయిన ఘన వ్యర్థాలు, నాలాల ఆక్రమణలు, ముంపునకు దారితీస్తున్నాయి. వర్షపు నీటి పరిమాణానికి, కాలువల సామర్థ్యానికి పొంతనలేని పరిస్థితులు, నిర్మాణ రంగంలో నిబంధనల ఉల్లంఘన, రాజకీయాల మితిమీరిన జోక్యం వంటి అనేక అంశాలు మూసీ వరదలకు కారణంగా నిలుస్తున్నాయి. ఇమ్లీబన్ బస్టాండుకు పక్కనే మూసీ నదిపై డంపింగ్ యార్డు ఉంది. ఇందులో నుంచి భరించరాని దుర్వాసన రావడంతో పాటు కలుషిత నీరు మూసీలోకి ప్రవహించి కొన్ని కిలోమీటర్ల మేర ప్రవాహంపై ప్రభావం చూపుతోంది. మూసీ కలుషితంపై హైకోర్టు కూడా జోక్యం చేసుకుంది. మురికికూపంగా మారడం వల్ల దోమల ఉత్పత్తి కేంద్రంగా మారిందని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. నదీ ప్రక్షాళనకు వెంటనే చర్యలు చేపట్టి అమలుచేయాలని ప్రభుత్వానికి ఆదేశించింది. నది మధ్యలో సిమెంట్‌లో కెనాల్‌ను నిర్మించి నీటి ప్రవాహం పెంచడమే కాకుండా ఆ నీటిని ఉద్యానవనాల అభివృద్ధికి ఉపయోగించాలని నిర్ణయించారు. ఈమేరకు ప్రాజెక్ట్ పనులు చేపట్టారు. హైకోర్టు సమీపంలో ఒక పార్కు నిర్మించి విద్యుత్ దీపాలు కూడా ఏర్పాటుచేశారు. అయితే ఈ ప్రాజెక్ట్‌ను సాంకేతిక కారణాలతో నిలిపివేశారు. మూసీనది హైదరాబాద్ నగరంలో సుమారు 14.2 కిలోమీటర్ల మేర ప్రవహిస్తోంది. హైదరాబాద్ డివిజన్‌లోని గోల్కొండ, ఆసిఫ్‌నగర్, బహదూర్‌పురా, చార్మినార్, నాంపల్లి, హిమాయత్‌నగర్, సైదాబాద్, అంబర్‌పేట రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సర్వేలు నిర్వహించారు. నివేదికలు సిద్ధం చేశారు. ఈ మేరకు సుమారు వెయ్యి కుటుంబాలకు నోటీసులు కూడా జారీ చేశారు. ఒక క్రమపద్ధతిలో ఆక్రమణలు తొలగించడంతో పాటు గట్టును పటిష్ఠం చేసే ప్రక్రియ కూడా ప్రారంభించాలని నిర్ణయించారు. అయితే రాజకీయ జోక్యంతో ఆక్రమణల తొలగింపు నిలిచిపోయింది. ప్రస్తుతం మళ్లీ ఈ అంశం చర్చనీయంగా మారింది. ప్రతిసారీ వర్షాలు, వరదలు వచ్చినప్పుడు హంగామా చేయడం మళ్లీ ఈ అంశం తెరమరుగు కావడం సర్వసాధారణంగా మారింది. ప్రభుత్వం ఆక్రమణలు తొలగించే అవకాశం లేదని తెలియడంతో నదీ పరివాహక ప్రాంతంలో కొత్తకొత్త కట్టడాలు నిర్మిస్తూనే ఉన్నారు. గతంలో చిన్న చిన్న గుడిసెలు ఉన్న ప్రాంతాల్లో ఇప్పుడు పక్కాగృహాలు కనిపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాలు రెండు మూడు అంతస్తులు కూడా నిర్మించుకున్నారు. మూసీకి వరదలు వచ్చినప్పుడు వంతెనలు మూసి వేయడంతో ఆ ప్రభావం ట్రాఫిక్‌పై పడుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు గత నాలుగు రోజులుగా వంతెనలు మూసి వేయడంతో నగరంలో చాలా భాగం ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచి పోయింది. అంబర్‌పేట, మూసారాంబాగ్, చాదర్‌ఘాట్, మలక్‌పేట తదితర ప్రాంతాల్లో గంటల తరబడి వాహనాలు నిలిచిపోతున్నాయి. వందల ఇళ్లు నీటమునిగాయి. విలువైన సామాగ్రి, ఫర్నిచర్, వంట పాత్రలు నీటిలో కొట్టుకుపోయాయి. ప్రతి రెండు సంవత్సరాలకు ఈసారి మూసీకి వరదలు రావడంతో అక్కడికి సమీపంలో ఉన్న కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్‌గా పరిగణించి ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టాల్సిన అవసరం ఉంది. ఇక్కడ ఉన్న బస్తీలో ప్రజలను వేరే ప్రాంతానికి తరలించడం, వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించడం ద్వారా ఆక్రమణలను ఖాళీ చేయించే అవకాశం కలుగుతుంది. రాజకీయాలకు అతీతంగా, అన్ని పక్షాలను కలుపుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టాల్సి ఉంది. అప్పుడే ఆశించిన ఫలితాలు లభిస్తాయి. నాలుగు దశాబ్దాలుగా ఏ ప్రభుత్వం చేయని గుర్తింపు ప్రస్తుత ప్రభుత్వానికి లభించే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# ప్రపంచంలో ఎత్తైన జలపాతం ఏంజెల్

**షేక్ అబ్దుల్ హకీం జాని**

**ప్రపంచంలోనే** ఎత్తయిన మహాద్భుత జలపాతం ఏంజెల్. ఇది దక్షిణ అమెరికాలోని వెనిజులా దేశంలో నిర్మానుష్య, దట్టమైన అటవీ ప్రాంతంలో ఉంది. వెనిజులాలోని బోలివర్ రాష్ట్రంలోని గ్రాండ్ సబానా ప్రాంతంలో ఎత్తయిన పీఠభూమిపై నుండి 979 మీటర్ల ఎత్తు (3,212 అడుగుల ఎత్తు) కొండలపై నుండి ఏంజెల్ జలపాతం జాలువారుతూ నయనానందం చేస్తుంది. ఈ జలపాతం కనైమా జాతీయ పార్కులోని ఆయన్ టెపుయి పర్వత శిఖరం అంచుల నుండి జాలువారుతుంది. కొన్ని సందర్భాలలో జలపాతాన్ని తాకుతూ మేఘాలు వెళు తుంటే స్వర్గం నుండి ఈ జలపాతం జాలువారుతుందా? అనే అనుభూతి కలగక మానదు. ఈ నీరు తరువాత కరౌ నది ఉపనది అయిన చురున్ నదిలోకి చేరి ప్రవహిస్తుంది. దట్టమైన అరణ్యంతో నిండిన ఈ పీఠభూమిలో వర్షాలు కూడా అధికంగానే పడతాయి. చదరపు ఆకారంలో ఉన్న పీఠభూముల్ని స్థానికులు 'టెపియూస్' అంటారు. 'ఆయన్ టెపుయి' అనే పర్వత శిఖరం నుండి ఈ జలపాతం కిందకు దుముకుతుంది. ఏంజెల్ జలపాతం సమీపంలో 'సవన్నా' అనే పచ్చగడ్డి మైదానాలు కూడా ఉన్నాయి. ఏంజెల్ జలపాతాన్ని తొలిసారిగా 1910లో 'ఎర్నెస్టో సాంచెజ్ లాక్రజ్' అనే వ్యక్తి చూసినట్లు తెలుస్తోంది. అయితే అతను దీన్ని తొలుత చూసిన విషయం వెలుగు చూడలేదు. అప్పట్లో ఈ ప్రాంత ప్రజలు ఏంజెల్ జలపాతాన్ని 'కేరేపకుపై మేరు' అని స్థానిక భాషలో పిలిచేవారు. పెమోన్ భాషలో 'కేరేపకుపై మేరు' అంటే అత్యంత లోతైన ప్రదేశంలో వుండే జలపాతమని అర్థం. ఈ జలపాతాన్నే పరకుప-మేరు అని కూడా పిలుస్తారు. అంటే అత్యంత ఎత్తయిన చోటు నుండి పడే జలపాతం అని అర్థం. మరికొంత మంది ఈ జలపాతాన్ని స్థానిక భాషలో చురున్ మేరు అని పిలుస్తారు. అంటే పిడుగు జలపాతం అని అర్థం. జలపాతాన్ని చూసిన తొలి వ్యక్తి జిమ్మీ ఏంజెల్ 2009లో



అధ్యక్షుడబైన హ్యూగో చావెజ్ ఆ జలపాతం పేరును 'కేరేపకుపై మేరు' అనే ఒక పెమోన్ భాష పదంగా మార్చాలనే తన ఉద్దేశాన్ని ప్రకటించారు. దేశంలోని అతి ప్రసిద్ధమైన ప్రదేశం పేరు స్థానిక భాషలో ఉండాలి అనే కారణంగా ప్రకటించడం జరిగింది. "ఇది మా ప్రాంతానికి చెందింది. ఏంజెల్ జలపాతం మాది. ఇది స్థానిక వారసత్వ సంపద" అని చావెజ్ జలపాతం పేరుమార్పిడి గురించి వివరణ ఇచ్చారు. అయితే చట్టప్రకారం పేరు మార్చబడదని, తాను కేరేపకుపై మేరు అనే పేరును సమర్థిస్తున్నానని అతను తరువాత చెప్పారు. ప్రపంచ ప్రజలు నేటికీ ఏంజెల్ జలపాతంగానే పిలుస్తున్నారు. లాక్రజ్ అనే వ్యక్తి ఈ జలపాతాన్ని తాను చూసినట్లు ప్రపంచానికి తెలియచెప్పలేకపోయాడు. సర్ వాల్టర్ రాలే ఏంజెల్ జలపాతాన్ని చూసిన తొలి ఐరోపా వాసి అని ఫెర్నాండో దే బెర్రియో అని కొందరు చరిత్రకారులు చెపుతున్నారు. ఫెర్నాండో దే బెర్రియో స్పెయిన్‌కు చెందిన 16, 17వ శతాబ్దాల నాటి అన్వేషకుడు, గవర్నర్. ఇది నిజం కాదని కొందరి వాదన. వాస్తవానికి ఈ జలపాతాన్ని 1912లో ఎర్నెస్టో సాన్చేజ్ లాక్రజ్ అనే వెనిజులా అన్వేషకుడు చూశాడు. కానీ అతను ఆ సంగతిని బహిర్గతం చేయలేదు. ఆ విషయం ప్రపంచానికి తెలియపరచలేదు. ఆ కారణంగా ఏంజెల్ జలపాతాన్ని తిలకించిన తొలి వ్యక్తిగా ఆయనకు గుర్తింపు రాలేదు. 1933 నవంబరు 16న అమెరికా విమాన చోదకుడు జిమ్మీ ఏంజెల్ విలువైన బంగారం, ఖనిజాల కోసం అన్వేషిస్తున్నప్పుడు ఈ జలపాతాన్ని తిలకించాడు. అప్పటివరకు ఇది బయట ప్రపంచానికి తెలియదు. జిమ్మీ ఏంజెల్ ఆయన్ టెపుయి కాలువలో ఈదుతుండగా ఈ జలపాతం అతని కంట పడింది. ఏంజెల్ తన సతీమణితో పాటు ఈ జలపాతాన్ని తిలకించాడు. ఇక్కడి పీఠభూమిపై అతికష్టంగా తన విమానాన్ని దింపాడు. కానీ ఆ చిత్తడి నేలలో విమాన చక్రాలు దిగబడి చెడిపోయింది. ఇంత చేసినా అతను ఏంజెల్ జలపాతాన్ని చేరుకోలేకపోయాడు. విమానం కిందకు దింపి కాలినడకనే కుటుంబ సమేతంగా ఏంజెల్ జలపాతాన్ని సందర్శించాడు. వీరితో పాటు మరో ముగ్గురు కూడా ఉన్నారు. అందరూ నడుస్తూ జనావాసాలకు చేరుకోవడానికి 11 రోజులు పట్టింది.

వారి సాహస వార్త వేగంగా వ్యాపించి, ఆ జలపాతానికి అతని గౌరవార్థం ఏంజెల్ ఫాల్స్ అని నామకరణం చేశారు. జిమ్మీ ఏంజెల్ సందర్శించిన 14 సంవత్సరాల తరువాత ఈ జలపాతానికి 'ఏంజెల్ ఫాల్స్' అని నామకరణం చేశారు. ఏంజెల్ వదిలి వేసిన విమానం ఆయన్ టెపుయి కొండపైనే 33 ఏళ్లు వుండిపోయింది. తరువాత హెలికాప్టర్ సహాయంతో దానిని తొలగించాడు. ఆ విమానం మారకేలోని ఏవియేషన్ మ్యూజియంలో ప్రజల సందర్శనార్థం కొంత కాలం ఉంచారు. ప్రస్తుతం అది సియుడాడ్ బోలివర్ విమానాశ్రయం ముందు బయట ప్రదర్శించబడుతోంది. 1956లో జరిగిన విమాన ప్రమాదంలో జిమ్మీ ఏంజెల్ మరణించారు.

ఏంజెల్ జలపాతంపై జిమ్మీ ఏంజెల్ విమానం చిత్తడి నేలలో ఇరుక్కున్న 18 సంవత్సరాల తరువాత ఈ జలపాతానికి నీళ్లు అందించే నదిని చేరుకున్న తొలి పాశ్చాత్య దేశస్తుడు అలేక్సాండ్రో లైమే అనే లాత్వియా అన్వేషకుడు. స్థానిక పెమోన్ జాతివారు ఇతన్ని అలెజాండ్రో లైమేగా కూడా పిలుస్తారు. అతను ఆయన్



టెపుయిని 1955లో ఎక్కాడు. అతను జలపాతానికి నీరు అందించే ఆ నదికి లాట్వియాలోని ఒక నదికి గావ్జా అనే పేరు పెట్టాడు. స్థానికులు మాత్రం పెమోన్ భాష పేరైన కరౌ అని ఈ నదిని పిలుస్తుంటారు. చురున్ నది నుంచి జలపాతానికి వెళ్లే దారిని కనిపెట్టిన తొలి వ్యక్తిగా కూడా లైమేను పేర్కొన్నారు. ఆ దారిలోనే, జలపాతాన్ని ఫోటోలు తీయడానికి వీలుగా ఉండే ఒక స్థలం ఉంది. దాని పేరు మిరడోర్ లైమే (లైమే వీక్షించే స్థలం అని స్పానిష్ భాషలో అర్థం) అని ఆయన గౌరవార్థం పెట్టారు. ఈ మార్గాన్నే ప్రస్తుతం పర్యాటకులను ఇస్ల రటన్ క్యాంపు నుంచి తీసుకువెళ్లడానికి వాడతారు.



జలపాతం ఎత్తు నిర్ధారణ

జలపాతం ఎత్తు 979 మీటర్లు అని అధికార పూర్వకంగా 1949 మే 13న అమెరికాకు చెందిన పాత్రికేయుడు రూథ్ రాబర్ట్సన్ నేషనల్ జియోగ్రాఫిక్ సొసైటి సర్వేలో తెలియజేశాడు. తొలిసారి విజయవంతంగా ఆయన్ టెపుయి ఎక్కి జలపాతం పై భాగానికి వెళ్లిన సంఘటన గురించి డేవిడ్ నాట్ రచించిన ఏంజెల్స్ ఫోర్ అని పుస్తకంలో వివరించారు. తొలిసారి విజయవంతంగా ఆయన్ టెపుయిని అధిరోహించి జలపాతం పై భాగానికి వెళ్లిన సంఘటన గురించి డేవిడ్ నాట్ రచించిన ఏంజల్స్ ఫోర్ అనే పుస్తకంలో వివరించారు. ఏంజల్ జలపాతం వెనిజులాలోని ముఖ్యమైన సందర్శక ఆకర్షణలలో ఒకటి అయినప్పటికీ నేటికీ ఆ జలపాతం వద్దకు పర్యాటకులు చేరుకోవడం క్లిష్టమైన విషయమనే చెప్పాలి. ఆ జలపాతం వెనిజులా లోని ఒక నిర్మానుష్య అడవిలో ఉంది. ప్యూర్టో ఒర్డాజ్ లేక సియుదాద్ బొలివార్ నుండి విమానంలో కనైమా క్యాంపుకు చేరుకోవాలి. అక్కడనుండే జలపాతం అడుగు భాగానికి నది మార్గం ద్వారా వెళ్లాలి. నది ప్రయాణాలు సాధారణంగా జూన్ నుంచి డిసెంబరు వరకు జరుగుతాయి. ఆ సమయంలోనే ఇక్కడి నదులు లోతు ఎక్కువగా ఉండి ప్రయాణానికి అనుకూలంగా ఉంటుంది. వర్షాకాలంలో నీరు ఎక్కువగా వున్నప్పుడు ఏంజెల్ జలపాతం అందాలు ద్విగుణీకృతమౌతాయి. వర్షపాతం లేని డిసెంబరు నుండి మార్చి వరకు ఈ ప్రాంతంలో ఇతర నెలలో కంటే తక్కువ నీరు ఉంటుంది. నేడు ఏంజెల్ జలపాతం అతి పెద్ద పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతోంది. ఇది ప్రపంచ ప్రజల్ని విశేషంగా ఆకర్షిస్తోంది. మేఘాలు సైతం ఈ జలపాతాన్ని తాకుతూ వెళతాయంటే ఇది ఎంత ఎత్తయిన జలపాతమో సునాయాసంగా అంచనా వేయవచ్చు. నీరు ఆవిరి రూపంలో పలుచని పొగమంచులా కూడా ఈ ప్రాంతాన్ని ఆవహిస్తుంది. కొన్ని సందర్భాలలో ఈ జలపాతం నుండి నీరు జాలువారుతూ కిందకు పడేలోపే కొంత భాగం ఆవిరి అయిపోతుంది. దీన్నిబట్టి ఏంజెల్ జలపాతం ఎంత ఎత్తులో ఉందో అంచనా వేయవచ్చు. 'సవన్నా'తో ఈ ప్రాంతం ముడిపడి ఉంది. పర్యాటకుల కోసం ఇక్కడ ఒక లాడ్జిని నిర్మించారు. 'కనైమా'లో ఒక హోటల్‌ను కూడా నిర్మించారు. ప్రపంచంలో విమానంలో ప్రయాణిస్తూ తిలకించగల ఏకైక జలపాతం 'ఏంజెల్ ఫాల్స్'. ఈ జలపాతం ఎత్తుపల్లాలను దాటుకుంటూ ప్రవహించి అట్లాంటిక్ మహాసముద్రంలో కలుస్తుంది. యునెస్కోవారు దీన్ని ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించారు.

నేటికీ దీన్ని తిలకించాలంటే పర్యాటకులు చాలా ప్రయాస పడవలసిందే. ఇప్పటికీ ప్రపంచ పర్యాటలకులు విమానం, బోటు షికారు ద్వారా ఏంజెల్ జలపాతాన్ని తిలకిస్తున్నారు. ఈ రెండు మార్గాలే ఏంజెల్ జలపాతాన్ని తిలకించడానికి ఈ రోజుకీ అనువుగా ఉన్నాయి. మొదటి సగం దూరం వరకు విమానంలోనే అక్కడకు చేరుకు ంటారు. అక్కడ నుండి జలపాతం అడుగు భాగానికి నదీ మార్గం ద్వారానే వెళ్లాలి. సాధారణంగా ఈ జలపాతాన్ని తిలకించ డానికి పర్యాటకులు నీళ్లు అధికంగా ఉండే జూన్ నుండి డిసెంబరు మధ్య కాలంలో వెళ్తుంటారు. ఆ కాలంలో నదిలో నీరు ఎక్కువగా ఉండి జలపాతం కూడా సుందరంగా కనిపిస్తుంది. కొందరు క్లైంబింగ్ సాహస యాత్రికులు ఏంజెల్ జలపాతం పక్కగా పాకుతూ ఈ పర్వతాన్ని అధిరోహిస్తూ ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తుం టారు. స్కై డైవర్స్ కూడా ఈ పర్వతంపై నుండి దూకి సాహసాలు చేస్తూ తమ ప్రతిభను చాటుతారు. ❑

# స్నేహమెంతో మధురం



నీ స్నేహితుణ్ణి బట్టి నువ్వెలాంటివాడివో చెప్పవచ్చు. తెలివైన సమర్థుడైన స్నేహితుడు నీ పక్కన ఉండటం గొప్ప వరం. 'ఇన్ అండ్ అవుట్ ద గార్బేజ్ పెయిల్' అనే పుస్తకాన్ని ఫ్రెడిక్-ఎస్-ఎర్ల్స్ రాశాడు. అందులో "మీరు స్నేహం చెయ్యాలనుకునే వ్యక్తుల లక్షణాల్ని పరిశీలించి, మీ భావాలను గౌరవించి, మనసుతో హత్తుకునే వ్యక్తులనే ఎంపిక చేసుకోవాలని" అన్నాడు. తల్లిదండ్రులతో, తోబుట్టువులతో పంచుకోలేనివి కూడా స్నేహితులతో చెప్పుకుంటాం. మనలోని తప్పొప్పులను తెలియజెప్పటం, అవసర సమయాల్లో చివరిదాకా నిలబడటం, విభేదాలొచ్చినా, రాకపోయినా పంచుకున్న రహస్యాన్ని అన్యుల ముందు బహిర్గతం చెయ్యని వాడే నిజమైన స్నేహితుడు. కొంతమంది కేవలం తాము సంతోషంగా ఉండేందుకు మాత్రమే ఇతరులతో స్నేహం చేస్తారు. తమ అవసరాలు తీర్చుకోవటం కోసం ఎదుటివారి బలహీనతల్ని కనిపెట్టి, చిన్న అవకాశాన్ని కూడా వదలకుండా తమకు అనుకూలంగా మార్చుకుని పరాన్న జీవులుగా బతుకుతారు. స్నేహితుడు కష్టాల్లో ఉంటే వదిలేస్తారు.

**స్నేహశాస్త్రం**

జీవితపు అన్ని దశల్లో ప్రతి ఒక్కరికీ స్నేహితులు ఉంటారు. కొంత మందికి తక్కువ స్నేహితులుంటే, ఇంకొందరు ఎప్పటి కప్పుడు కొత్త స్నేహితుల్ని ఇష్టపడతారు. 'స్నేహం' మనిషి జీవితానికి మనుగడ ఉండదు. బాల్యపు స్నేహాలెప్పుడూ మధుర జ్ఞాపకాలే. పరిపక్వ దశలో అంటే కళాశాల స్థాయి స్నేహాలే బంధాలుగా బలపడతాయి. ఆపదలో ఉన్నపుడు మన మెదడు ఎలా స్పందిస్తుందో, మన స్నేహితులు ప్రమాదంలో ఉన్నపుడు అలాగే పని చేస్తుంది. అదే ప్రాణ స్నేహమంటే. స్నేహబంధం బలంగా ఉండే స్నేహితులు డి.ఎన్.ఎ.లు ఒక్క శాతం ఒకేలా ఉంటాయట. వాళ్ల ఆలోచనలు, వాళ్ల పోలికలు ఒకేలా ఉంటాయనీ, ఆ సారూప్యమే వాళ్లని స్నేహితుల్ని చేస్తుందని పరిశోధనల్లో తేలింది.

సృష్టి మొదలైనప్పటి నుంచీ స్నేహ బంధం ఉందో లేదో తెలియదుగానీ, ఇతిహాస కాలం నుండి మాత్రం 'చెలిమిబంధం' ఉంది. సూతపుత్రుడున్న కారణంగా యుద్ధ విద్యా పోటీలో పాల్గొనలేని కర్ణుడి పరిస్థితి అర్థం చేసుకున్న దుర్యోధనుడు అతడిని అంగరాజ్యానికి రాజును చేశాడు. అందుకు ప్రతిగా తన మిత్రుడు చేస్తున్నది తప్పు అని తెలిసినా, తాను కుంతీపుత్రుడినని తెలిసినా, మిత్ర ధర్మానికి కట్టుబడి కురుక్షేత్ర సంగ్రామంలో ప్రాణాలర్పించి స్నేహానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన దుర్యోధన-కర్ణుల చెలిమి అజరామరమే.

**కనిపించని భావమే స్నేహం**

స్నేహం అంటే నమ్మకం, భరోసా, కనిపించని భావం. దూరంగా ఉన్నా పలకరించుకునే భాష. నడక రాకముందే పిల్లలు సైతం స్నేహం చెయ్యగలరు. చేతులు జాపితే పసిపిల్లలు కొందరు దగ్గరకే వెళతారు. అంటే స్నేహం కూడా ఓ భావోద్వేగం. ఆ బంధం కొందరి మధ్యే

**కవర్ స్టోరీ**

**ఎం.వెంకటేశ్వర రావు**

శాశ్వతంగా నిలిచిపోయింది. 'స్నేహితుల భాష మానసికం. దానిని ఆకళింపు చేసుకోవడానికి జీవిత కాలం సరిపోదు' అంటాడు షేక్స్పియర్.

పరస్పర నమ్మకం ఉంటేనే ఇద్దరి మధ్య స్నేహం వృక్షంలా ఎదుగుతుంది. జీవితమనే సాహస యంత్రంలో మనకి ప్రతి రోజూ ఒక శిఖరారోహణమే.

మన జయాపజయాలు మన వెంట ఉన్న స్నేహితులపై ఆధారపడి ఉంటాయి.

అవరోధాలు, స్వార్థ ప్రయోజనాలు, ఆర్థిక సంబంధాలు, ఆధిపత్య ధోరణులు, అర్థరహిత నియంత్రణలే స్నేహ సంబంధాల విచ్ఛిన్నానికి చాలావరకు కారణాలవుతాయి.

స్నేహం బలపడటానికి అవరోధాలు స్వార్థం, అహం. వీటికి అస్సలు తావివ్వకూడదు. అప్పుడే పరస్పర సాహచర్యం, ప్రగతి, పరస్పర విజయాలను ఆకాంక్షించి ఆస్వాదించగలుగుతారు. అలాంటి గొప్ప స్నేహానికి ఉదాహరణ 'బాపూ-రమణలే'.



60 ఏళ్ళ స్నేహానికి షష్టిపూర్తి..

**బాపు-రమణ**

గోదావరి జిల్లాల్లో పుట్టిన ఒక బాపు, ఒక రమణ. బాపుది పడమర, రమణది తూర్పు. ఈ తూర్పు, పడమరల్ని కలిపి ఇన్నాళ్లూ, ఇన్నేళ్లూ మనకి హాయిగా, హుషారుగా అన్నిటికి మించి స్వచ్ఛంగా నవ్వుకునే అదృష్టం మొదటిసారిగా కలిగించింది ఆకాశవాణి రేడియోలో బాలానందం కార్యక్రమం నిర్వహించిన రేడియో అన్నయ్య న్యాయపతి రాఘవయ్య గారు, రేడియో అక్కయ్య కామేశ్వరి గారు. వారు నడిపిన 'బాలపత్రిక' 1946లో బాపు వేసిన బొమ్మ, రమణ రాసిన కథ ప్రచురింపబడి 'బాపు-రమణ'ల శకానికి ప్రారంభం జరిగింది. అప్పట్నుంచి 2015 వరకు షష్టిపూర్తి జరుపుకుంది(60 సం॥లు). తెలుగుభారతి అందమైన బాపు బొమ్మలతో, కడుపుబ్బ నవ్వించే రమణ రాతల గోదావరి గలగలలతో చరిత్రను నడిపించింది. కలకాలం నడిపిస్తుంది. బాపు(సత్తిరాజు లక్ష్మీనారాయణ), రమణ(ముళ్ళపూడి వెంకటరమణ). బాపు కన్నా రమణ రెండేళ్ల పెద్ద. బాపు-రమణల స్నేహం అజరామరం. వీళ్లిద్దరూ సృష్టించిన పాత్రలు గుర్తొస్తే చాలు నిత్యం నవ్వులే నవ్వులు. బుడుగు, గానపెసూనాంబ, పక్కింటి పిన్నిగారు.. ఇలా ఎన్నెన్నో. పదహారణాల తెలుగు పడుచుని బాపుబొమ్మలా ఉందంటాం. స్వచ్ఛమైన హాస్యానికి అజరామర స్నేహానికి కేరాఫ్ అడ్రస్‌గా 'బాపు-రమణ' ఎవరూ చెరపలేని ట్రెండ్ సెట్ చేశారు. బాపూ గీత, రమణ రాత చలన చిత్ర రంగంలో చేసిన అద్భుతాలు అన్నీ ఇన్నీ కావు. రచయితగా రమణ; దర్శకుడిగా బాపు అజరామరమైన చిత్రాల చరిత్ర సృష్టించారు. 'సాక్షి' చిత్రంతో మొదలైన బాపు-రమణల సినీ ప్రస్థానం 'శ్రీరామరాజ్యం' వరకు కొనసాగి తమ ప్రతిభలకు పరస్పర పట్టం గట్టుకుని ఆణిముత్యాలను అందించిన మహనీయులు. జీవనంలో, జీవితంలో ఒకటే మాట, ఒకటే బాటగా ఒకే ఇంట ఈ జంట 60 వసంతాలు పంచుకున్న మాధుర్యాలు ఈ జన్మకి సెలవంటూ ముందుగా 2011లో రమణ గారు వెళ్లిపోయారు. నువ్వు లేకుండా నేనొక్కణ్ణీ భూలోకంలో ఉండలేనంటూ సంవత్సరానికే బాపు ఆయన వద్దకు వెళ్లిపోయారు. వీరిద్దరినీ, వీరి స్నేహాన్నీ చిరస్మరణీయం చేయాలని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శాసనసభలో ప్రకటించారు. అన్నమాట ప్రకారం రాజమండ్రిలో గోదావరి ఒడ్డున



కలిసింది మొదలు కడవరకూ స్నేహాన్నే ఊపిరిగా శ్వాసించిన ఈ ఇద్దరి మిత్రుల విగ్రహాలను ప్రతిష్ఠించి వీరి స్నేహాన్ని చిరస్మరణీయం చేశారు.

"నా స్నేహితుడికి నేను చెయ్యగల ఉపకారం అతణ్ణి ఎప్పుడూ సంతోషంగా ఉంచడమే" అన్నాడు రాబర్ట్ ఫ్రాస్ట్.

ఒకే అభిప్రాయాలు గల వ్యక్తులు మిత్రులవటం సాధారణమే. కానీ దానిని కొనసాగించేవాళ్లు అరుదు. ఉద్యోగమైనా, వ్యాపారమైనా అన్ని విషయాల్లో పరస్పరం గౌరవించుకుంటూ ఎల్లప్పుడూ ఒకరి సాహచర్యాన్ని మరొకరు కోరుకుంటూ పాలు-నీళ్లలా కలిసిపోయే స్నేహం అంకురిస్తే, అది వటవృక్షమై ఎంతో మందికి ఆశ్రయమిస్తుంది.

అలాంటి అపురూప స్నేహితులు అటల్‌బిహారీ వాజ్‌పేయి-లాల్‌కృష్ణ అద్వానీ. అటల్ బిహారీ వాజ్‌పేయ్, లాల్‌కృష్ణ అద్వానీ ఇద్దరూ రాజకీయ దురంధరులే. వీరిరువురు వ్యక్తులుగా ఇద్దరైనా వీరి ఆత్మలు ఒక్కటే. వాగ్బాణాలతోనే ప్రత్యర్థుల్ని ఉక్కిరిబిక్కిరి చేసే మృదుస్వభావి ఒకరైతే, మౌనంగా కనిపిస్తూనే పక్కా ప్రణాళికతో అనుకున్నది సాధించే వ్యూహకర్త ఇంకొకరు. దేశ రాజకీయ చరిత్రలో కొత్త అధ్యాయం లిఖించిన 'ఫిర్ సుభా హోగీ' అంటూ సినిమా హాల్లో స్నేహగీతం ఆలపించినా వారికే చెల్లింది. అందుకే అటల్, అద్వానీల స్నేహం ఎన్నటికీ చెరగనిది. నాణేనికి రెండు వైపులు ఉన్నట్టుగా స్నేహానికి రెండు వైపులా అటల్, అద్వానీలు. వాజ్‌పేయ్ దీక్షాదక్షతలు, అద్వానీ కార్యనిర్వాహక శక్తి కలగలిపి జనసంఘ్ రథ చక్రాలయ్యాయి.

అటల్‌తో కలిసి 50 ఏళ్లు ఉన్నారు అద్వానీ. పార్లమెంటులో మాత్రం 40-45 ఏళ్లు పని చేసారు. "నాకు మార్గదర్శి అటల్‌జీ" అంటారు అద్వానీ. సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో చెక్కుచెదరని స్నేహం వీరిది. రాజకీయాల్లోనే కాక వీరి మధ్య వ్యక్తిగత స్నేహం బలంగా ఉండేది. వాజ్‌పేయ కిచిడీ వండి అద్వానీకి తినిపించేవారు. 50వ దశకంలో అటల్‌జీతో చూసిన 'ఫిర్ సుభా హోగీ' చిత్రం ఎప్పటికీ మరచిపోలేనిదని అంటారు అద్వానీ. భారతీయ జాతీయ కాంగ్రెస్‌కి మేమే ప్రత్యర్థులమంటూ ఎదిగిన బిజెపికి జవసత్వాలు అందించిన ఈ మిత్రద్వయం జీవితంలోనూ వీరిద్దరి మైత్రీబంధం విడదీయలేనిది.

జీవితంలో కొన్ని సార్లు మన భావాలకు, అభిప్రాయాలకు పొంతన లేని వ్యక్తులు తారసపడుతున్నారు. వాళ్లతో తప్పనిసరి స్నేహాలు, బాంధవ్యాలు కొనసాగించాల్సిన పరిస్థితులు ఎదురవుతుంటాయి.



రాజకీయ, సినీ రంగాల్లో శాశ్వత మిత్రత్వం కానీ, శాశ్వత శత్రువులు ఉండరంటారు.
'రియాలిటీ' అనే కవితలో విల్‌కాక్స్ అనే రచయిత "ధనం స్నేహితులని మీ చుట్టూ చేరిస్తే, దరిద్రం నిజమైన స్నేహితులని మిగులుస్తుంది.
మీరు ఆనందంగా ఉండండి, మనుషులు మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తారు. దుఃఖంలో ఉంటే వెనుదిరిగిపోతారు. సంతోషంగా ఉండండి.. మీకెందరో స్నేహితులు దొరుకుతారు. మీరు అందించే అమృతాన్ని ఎవరూ వద్దనరు. కానీ మీ విషాన్ని మీరొక్కరే తాగాలి" అంటాడు.
సినీ ప్రముఖుల్లో కొంత మంది ఎంత త్వరగా కలిసారో అంతే త్వరగా విడిపోయారు. విశ్వనాథన్ రామ్మూర్తి(సంగీతం), సలీం జావేద్(కథా రచయితలు); నదీం శ్రవణ్(సంగీతం).. ఇలా ఎంతో మంది.
ఎటువంటి త్యాగాలకైనా సిద్ధపడే అరుదైన స్నేహితులుగా దుర్యోధనుడు-కర్ణుడు ఇతిహాసాల్లో నిలిచిపోతే; మిత్రుడి కోసం ఏదైనా తీసుకెళ్లాలన్న తపనతో శ్రీకృష్ణుడికి అటుకులు తీసుకెళ్లాడు సుధాముడు.
'స్నేహితుల భాష మానసికమైంది' అన్నారు విలియం షేక్స్‌పియర్.



**నరేంద్రమోడీ-అమిత్ షా**

ప్రస్తుత రాజకీయాల్లో కృష్ణార్జునులుగా పిలుచుకుంటున్న వీరిద్దరూ బాల్యస్నేహితులు కాదు, ఒక ఊరికి చెందినవారూ కాదు. కనీసం కాలేజీలో కూడా కలిసి చదువుకోలేదు. కానీ ఇద్దరూ ప్రాణ స్నేహితులు. ఒకరిది మాట, మరొకరిది బాట. ఒకరిది పలుకు, మరొకరిది పిలుపు. ఆయన మాట ఈయనకు సుగ్రీవాజ్ఞ. ఈయన అడుగు ఆయన వేదవాక్కు. వాళ్లిద్దరే భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ, హోం శాఖా మంత్రి అమిత్ షా. బిజెపి సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించడంతో వీరిద్దరి పేర్లు ప్రభంజనమైపోయాయి. బిజెపిని అత్యధిక మెజార్టీతో గద్దెనెక్కించడంలో వీరిద్దరి పాత్ర ఎంతో కీలకమైంది. మోడీకున్న చరిష్మాను జనంలో సరైన సమయంలో ఫోకస్ చేసి, ఆయన విజయాన్ని నల్లేరు మీద నడకలా చేసిన వ్యూహకర్త అమిత్ షా. మోడీకి నిజమైన సన్నిహితుడు. వీరి స్నేహాన్ని ఉదాహరణలుగా ఎవ్వరినీ పోల్చలేం. రాజకీయాల్లో చిన్న స్థాయిలో ఉన్నప్పుడు వీరిద్దరి మధ్య చిగురించిన స్నేహం దేశాన్ని శాసించే స్థాయికి వెళ్లింది. నాలుగు దశాబ్దాల వీరి స్నేహంలో చిన్న పొరపాట్లు లేకపోవటం విశేషం. మోడీ, షా వేర్వేరు కాదనే భావన ప్రజల్లో ప్రబలం కావటానికి కారణం వీరి మధ్య ఉన్న స్నేహబంధమే. జయాపజయాలకు అతీతంగా శాశ్వత మిత్రత్వంతో కొనసాగుతున్న మోడీ, షాల స్నేహం స్వరణీయం.
"నీ స్నేహితుడు ఎవరన్నదానిని బట్టి నువ్వెలాంటి వాడితో చెప్పవచ్చు.



తెలివైన, సమర్థుడైన స్నేహితుడు నీ పక్కన ఉండటం జీవితంలో గొప్ప వరం" అంటారు స్టాన్‌డేల్.
నిజమే..! పరస్పర గౌరవంతో ఏర్పడేదే నిజమైన స్నేహం. ఇటువంటివారు ఒకరి గురించి మరొకరు ఆలోచిస్తారు. ఒకరి విజయాన్ని మరొకరు కాంక్షించేదే నిజమైన స్నేహం. వ్యక్తిత్వం, నిజాయితీ, నిబద్ధత, నిస్వార్థం.. నిజమైన స్నేహపు లక్షణాలు.

**రాజీవ్‌గాంధీ-అమితాబ్‌బచ్చన్**

అలాంటి అరుదైన స్నేహితులు దివంగత భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ, సినీ దిగ్గజం అమితాబ్ బచ్చన్‌ల స్నేహం. వీరిద్దరి మధ్య బాల్యంలోనే స్నేహం మొదలైంది. వీరిద్దరి కుటుంబాలు సన్నిహితంగా ఉండటం ఒక కారణం. వీరిద్దరి మధ్య పరస్పర నమ్మకం స్నేహంగా మారింది. అమితాబ్, రాజీవ్ కంటే రెండేళ్ల వయసులో పెద్ద. రాజీవ్ గాంధీ ప్రధాన మంత్రి అయ్యాక కూడా వీరి స్నేహంలో మార్పు లేదు. రాజకీయాలు స్నేహానికి పునాది కాదని అమితాబ్ ఓ ఇంటర్వ్యూలో చెప్పారు.
"స్నేహబంధాలు దిన దిన ప్రవర్థమానమవ్వాలి. ఇరు వైపులా సహకారం, అర్థం చేసుకునే స్వభావం, ఇచ్చిపుచ్చుకోవడం, పట్టువిడుపు, పారదర్శకం ఆధారంగా స్నేహం బలపడుతుంది. అరమరికలు, స్థాయీ భేదాలు, వివక్షలు, దాపరికాలు లేనివాళ్లే నిజమైన స్నేహితులు. ఎటువంటి సమస్యనైనా, సంతోషాన్నైనా కనీసం ఒక్క స్నేహితుడితోనైనా మనసువిప్పి పంచుకోగల్గాలి. మలినాలు వాటంతటవే పరిశుభ్రపడతాయి. స్నేహితుడికి చెయ్యగల్గిన అత్యున్నత ఉపకారం జీవితాంతం స్నేహం చెయ్యడమే. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం-ఇళయరాజా కొన్నాళ్ల క్రితం జ్ఞాని ఇళయరాజా ఓ సంగీత విభావరిలో వేరైనా తను సంగీతం అందించిన పాటలు కచ్చేరీల్లో పాడితే రియాల్టీ ఇవ్వాలని ప్రకటించారు. అదే సమయంలో స్వర్గీయ గాన గంధర్వులు శ్రీ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సంగీత విభావరి ఆరంభమైంది.



ఇళయరాజా పాటలు పాడకుండా కచ్చేరీ ఎలా ఉంటుంది? ఈ విషయం దావానంలా ఇళయరాజా–ఎస్పీబీల మధ్య గొడవ అంటూ మీడియా కోడై కూసింది. ఒక సంవత్సరం పాటు ఇద్దరి మధ్యా దూరం ఏర్పడింది. తర్వాత కలిసిపోయారు. ఎందుకంటే ఇద్దరి సంగీత ప్రయాణం ఒకేసారి మొదలయింది. ఇద్దరి మధ్యా మైత్రీబంధం బలపడింది. 'రారా', 'ఏరా' అనుకునే అనుబంధం వారిది. ఇదే విషయంపై ఓ ఇంటర్వ్యూలో ఎస్పీబీ స్పందించి ఇలా అన్నారు.. "ఇంట్లో ఉన్నవారి మధ్య కూడా చిన్న చిన్న పొరపొచ్చాలు, అభిప్రాయ భేదాలు రావటం సహజం. ఇద్దరి ప్రాణమిత్రుల మధ్య కూడా సహజమే. పంతాలు, పట్టింపులకు పోతే తెగేవరకూ లాగటమే అవుతుంది. అభిప్రాయ భేదాలు వ్యకిగతమైనవి కానపుడు పట్టించుకోవాల్సిన అవసరం లేదు. నా పాట అంటే రాజాకి ఇష్టం, ఆయన సంగీతం అంటే నాకు మహా ఇష్టం. మా స్నేహానికి ఓ సంవత్సరం పాటు గ్రహణం పట్టింది. గ్రహణ సమయంలో కూడా సూర్య, చంద్రులిద్దరూ ఒకటిగానే ఉంటారు. సోషల్ మీడియా ఎంత ఉపకారో అంతే అపకారి కూడా. మా ఇద్దరి మధ్యా లేని వివాదానికి మీడియా ఆజ్యం పోసింది. ఇది కూడా మంచిదే. 'విరహం కూడా సుఖమే కాదా.. నిరతము చింత మధురము కాదా'. విరహం తర్వాత కలయిక ఎంతో మధురంగా, హాయిగా ఉంటుంది. మా ఇద్దరి మధ్య చిన్న కాలదోషం వచ్చింది. నాకు బంధాలంటే ఎంతో ఇష్టం. స్నేహమంటే మరీ ఇష్టం. జీవితం చాలా చిన్నది. అది మంచి పాటలా సాగాలే తప్ప మధ్య మధ్యలో



వచ్చే తుఫాన్లకి కూలిపోయే మహావృక్షంలా ఉండకూడదు. ప్రవాహానికి తలొగ్గిపోయే గడ్డిమొక్కలా ఉండేదాలి. నేనెపుడూ నన్ను నేనో గడ్డిమొక్కలాగే భావిస్తాను. మహావృక్షాన్ని అనుకుంటే ఎప్పుడో కూలిపోయేవాణ్నేమో!" ఈ సందర్భంలో శ్రీ రామోజీరావు గారు చెప్పిన మాటలు గుర్తు చేసుకుంటూ– "ఏ వ్యక్తితోనైనా స్నేహం చెయ్యడానికి ముందే వంద సార్లు ఆలోచించుకోవాలి. స్నేహం మొదలెట్టాక ఎదుటివారిలో ఎన్ని లోపాలున్నా జీవితాంతం భరించాలి. కానీ స్నేహాన్ని వదిలిపెట్టకూడదు" అంటూ ముగించారు.

స్నేహితుల్ని సంపాదించుకోవడం తేలికే. కానీ ఆ స్నేహాల్ని చివరి వరకూ కాపాడుకోగల్గాలి. తరచూ కలుసుకోవాలి. మనసువిప్పి మాట్లాడుకోవాలి.



స్నేహితుడు కష్టాల్లో ఉన్నపుడు 'నీకు నేనున్నాననే భరోసా కల్పించాలి. నీ కోసం ఏదైనా చేస్తాను' వంటి భరోసా, భాషే స్నేహ పోషణకు సేంద్రియ ఎరువు. కంటికి కనిపించని అవగాహన. "స్నేహితుడి కోసం ప్రాణం ఇవ్వడం గొప్ప విషయం కాదు. ప్రాణం ఇచ్చేటంత స్నేహితుణ్ణి పొందటం అదృష్టం" అన్నాడు జాన్ రస్కిన్.

**మధుర భావన**

స్నేహం బాల్యం నుండి అలవడే సద్గుణం. నడక, మాటలు, నేర్వక ముందే పసిపిల్లలు కొందరి దగ్గరికి సంతోషంగా వెళ్తారు. వాళ్లకి ఇష్టం లేనివాళ్లు దగ్గరికి తీసుకుంటే వెంటనే ఏడుస్తారు. స్నేహం ఓ అద్భుతమైన భావ ప్రకటన.

స్నేహం అంటే రెండు శరీరాల్లో ఉండే ఏకాత్మ. ఇద్దరు స్నేహితుల మధ్య వ్యక్తిత్వం, నిబద్ధత, నిజాయితీ, నిస్వార్థం అనే నాలుగు స్తంభాలే స్నేహ సౌధానికి పునాదులు.

పాలు, నీళ్లలా కలిసిపోయే గుణంగల వ్యక్తుల మధ్య స్నేహం అంకురిస్తే అది స్నేహ వృక్షమై ఎంతో మందికి ఆశ్రయమిస్తుంది.



నేటి యువత చదువు, ఉద్యోగం, సామాజిక జీవితంలోని ఒత్తిళ్లకు లోనవుతూ స్నేహం ముసుగులో వ్యసనాలకు బానిసలు అవుతున్నారు. అలాంటి సందర్భాల్లో మంచి–చెడుల విచక్షణ తెలిపే స్నేహితుడు అండగా ఉంటే మనలో ఉన్న దుర్గుణాలు వాటంతటవే తొలగిపోతాయి. కంటికి రెప్పలా, కాలికి చెప్పులా మారడానికి సిద్ధపడేవాడే నిజమైన స్నేహితుడు. తప్పు జరిగినపుడు "ఎవరిది తప్పు? ఎవరిది ఒప్పు?" అనే రంధ్రాన్వేషణకు బదులు "ఏది తప్పు? ఎక్కడ జరిగింది?" అని ఆలోచించి సరిదిద్దుకోగలిగిన వాళ్ల మధ్యే స్నేహం సజీవంగా నిలుస్తుంది. "ఇవ్వడం, తీసుకోవడం, దాపరికాలు లేకుండా మనసులోని మాటల్ని, భావాల్ని పంచుకోవడం, అడగటం, తినటం, తినిపించడం అనే ఈ లక్షణాలు స్నేహమున్న చోటే ఉంటాయి.

స్నేహపు పార్శ్వాలెప్పుడూ పారదర్శకంగా ఉండాలి. మనకబారే స్నేహాల వలన కుటుంబ బంధాలు, సామాజిక సంబంధాలు దెబ్బతింటాయి. స్నేహితుల మధ్య ఉండే అలవాట్లను, భాషను ఇంటి వరకు తీసుకురాకూడదు. స్నేహితుల అక్కచెల్లెళ్ల ముందు, భార్యల ముందు హద్దు మీరి ప్రవర్తించకూడదు.

**ముగింపు**

ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏటా ఆగస్టు మొదటి వారంలో 'మైత్రీ దినోత్సవం' జరుపుకోవటంతోనో, పరస్పరం బహుమతులు ఇచ్చి పుచ్చుకోవడంతోనో ఆగిపోకూడదు.

మనసుల్లో పేరుకుపోయిన మలినాల్ని నిజాయితీగా కడిగేసుకోవాలి.

స్నేహబంధాన్ని ప్రాణప్రదంగా కాపాడుకోవడానికి మనల్ని మనం సమాయత్తం చేసుకునే పవిత్రమైన రోజుగా మైత్రీ దినోత్సవం జరుపుకోవాలి.




**ఒకటి** అని చెప్పలేనిది ఇది/ ఇలాగే అని బంధించలేనిది
ఒక పట్టాన నిర్వచించలేనిది/ రెక్కలు విరిచితే తప్ప..
వ్యాఖ్యలు చేసుకోవచ్చు
ఆ నదంతా కలుషితం పారుతుందట
ఆవలేమో వెన్నెలుంటది
మరి దానికోసం దీన్ని భరిస్తూ దాటాలి
ఒక తెప్పో ఒక పక్షో సాయం చేస్తే చెప్పలే
మనుషుల భాష వేరాయే
అవేమో వీటికతీతంగా సంచరిస్తుంటాయ్
బతుకు వృధా/ ఎవరికోసమో నిరీక్షిస్తూ
ఇంజన్‌ను ఆన్‌లో ఉంచిన వాహనంలా
దహనమైపోతుంటాయ్/ శబ్దం తైలం ఉష్ణం..
బతుకుబండిని కాసేపు ఆపి ఇక
చిన్న బోటును ఆవిష్కరించుకుంటే!?
అప్పుడు మనతో పాటు సమాంతరంగా వస్తుంటాయ్
నిటారుచెట్లు గడ్డిపొదలు గుబుర్లు గుంపు కదిలి
కొంగలు వాలి ప్రశ్నిస్తాయ్
అపార్థం ఆపాదించినందుకు/ ఆహారపు గొలుసు..
నువ్వూ తింటావ్ మరిచావా అంటాయ్
ఏ యంత్రమూ లేకుండా వెళ్తున్నాం కదా ఇప్పుడు
గాలి తెస్తుంది చూడు నిట్టూర్పు సెగలను
అవి వ్యథల స్మృతుల నుంచి పుట్టి/ అపసవ్య దిశలో వచ్చి
తగులుతుంటవి
చైతన్యం మనలోంచే కదా/ ఇప్పుడనుకుంటే విరిచేస్తాం దీన్ని
కసిగా పిచ్చి పిచ్చిగా../ అయ్యో.. నిశ్శబ్దత కృతజ్ఞత లేదా?
పోనీ ఇవేమీ లేని ఖాళీగా ఈదడం తెలియదా?
అసలు ఊరుకోమా?
నీళ్లలా ఈ ప్రకృతిలా ఆ గడ్డిపోచలా వెలగలేమా
కాంతులీనలేమా... మనం!?

**- రఘు వగ్గు**

---

## ఈ వారం కవిత్వం



**అ**తడు మడక బట్టి దుక్కి దున్నితే
సాలు చక్కదనం చిక్కదనంతో
చిందులేస్తుంది.
అతడు గుంటికతో పాపనం చేస్తే
నేలతల్లి పరవశించి మృదువు మెతవుతుంది.
అతడు గొర్రుబట్టి విత్తనం విత్తుతే
మొలిచిన మొక్కలన్నీ వరస నిల్చి
గాలికి ఆడపిల్లలై నాట్యం చేస్తాయి.
అతడు మాను తోలి నాలుగు వైపుల సగచేస్తే
భూమెమ్మ అద్దమై మెరుపులీనుతుంది.
అతడు వామేస్తే చూడచక్కని రూపుదాల్చి
బుద్ధుడు సిద్ధుడు సుందర విగ్రహాలై నిలుస్తాయి.
అతడు కాడికట్టి మేడిపట్టి ములుగర్ర చేతపట్టి
వెలపటెద్దును దాపటెద్దును తోలుతుంటే
సవ్యసాచిలా కనబడుతాడు.
తనంతటి సేద్యగాడు
చుట్టుపక్కల వూర్లల్లో లేడనిపించుకున్నాడు.
అయితే.. అంతటితో అతనికి తృప్తి కలగలేదు.
ఆశించినంత పేరు రాలేదనుకున్నాడు.
అప్పుడతడు పట్నం బోయి
అందంగా హృద్యంగా
పద్యం రాయడం మొదలుపెట్టాడు.
ఇప్పుడతని పేరు దేశమంతా పాకి
ప్రశంసలందుకున్నాడు
సన్మానాలతో సత్కారాలతో
ఉబ్బితబ్బిబ్బైయ్యాడు
ఇంతకు సేద్యం గొప్పదా!
పద్యం గొప్పదా!

**- కాశీవరపు వెంకటసుబ్బయ్య**



## పుస్తక సమీక్ష



## ప్రతిభాలక్ష్మి అనుబంధాల కథలు

డా॥ ప్రతిభాలక్ష్మి 'అనుబంధాలు ప్రతిబంధకాలు' కథా సంపుటిలోని పదికథలలో ప్రేమ, పెళ్లి, ఆకర్షణ, బాధ్యతల కుటుంబ నేపథ్యంలో ముఖ్యంగా మహిళల జీవన కథనాలను కథలుగా ప్రతిబింబింపచేసారు. 'ఆన్‌లైన్ అలజడి' తొలికథలో అంతర్జాల బాంధవ్యంతో పెళ్లి, 'అనుకోని అగాధం'లో పెళ్లి తిరస్కరణ కారణంగా యాసిడ్ ఘాతుకం, యవ్వనోద్వేగంలో 'తొలివలపు' కూతురిపై కన్నతండ్రి సహజ వాత్సల్యం తెలిపే 'పితృదేవోభవ' వంటి పది కథలు ఈ పుస్తకంలో వున్నాయి. ప్రతి మరణానికి వైద్యులే కారణం అన్నట్లు, ఆరోగ్యం చేతిలో ఉండగా జాగ్రత్త పడకుండా, చెయ్యి జారిపోయాక వైద్యుల్ని నిందించే కథ 'వైద్యుడి వేదన', 'వృత్తి రీత్యా రచయిత్రి అనుభవాలను తెలియచేసి చదువరులకు మేలు చేస్తుంది. నిరుపేదల పట్ల, మహిళా సంక్షేమం కోసం, సామాజిక సేవలందించే వైద్యురాలిగా వృత్తిధర్మం నిర్వర్తిస్తూ ప్రవృత్తిపరంగా రచయిత్రిగా తన అనుభవాలను కథలుగా తీర్చిదిద్దడంలో, డా॥ ప్రతిభా లక్ష్మి, కృతకృత్యులయ్యారు.

ఉత్తమ వైద్యురాలిగా ఎన్నో అవార్డులు పొందిన రచయిత్రి తన మనోభావాలను, తాను పొందిన అనుబంధాలను, ప్రతిబంధకాలను వస్తువైవిధ్యంతో కథలుగా చిత్రీకరించారు. నడుస్తున్న సమాజంలో యువతరం ఎదుర్కొంటున్న జీవన వైచిత్రికి ఈ కథాసంపుటి చక్కటి ప్రతిబింబంగా చదివింపచేస్తోంది. **(అనుబంధాలు ప్రతిబంధకాలు, రచన: డా॥ప్రతిభాలక్ష్మి, వెల: రూ 200, ప్రతులకు: ప్లాట్ నం.14, న్యూ ఎస్.బి.హెచ్.కాలనీ, వెస్ట్‌మారెడ్‌పల్లి, సికింద్రబాద్-26)** **- ఎర్రమిల్లి**

## రామిరెడ్డి 'స్పర్శవేది కథలు'



ఎమ్వీ రామిరెడ్డి మూడవ కథల సంపుటి 'స్పర్శవేది కథలు'. ఇందులో మొత్తం 16 కథలు ఉన్నాయి. ఇందులో కథలన్నీ నిత్యజీవితంలో అతిదగ్గరగా ఉండే కథలు. ఈ కథలలో సంఘటనలు, పాత్రలు మనకు ఏదో ఒక సందర్భంలో అనుభవంలోకి వచ్చి ఉంటాయి. ఇలాంటి మనుషులు మనకూ తారసపడి ఉంటారు. రచయిత ఇదే విషయాన్ని తన ముందు మాటలో ప్రస్తావించారు. చెరువు ఒక కథగా ప్రత్యక్షమయింది' అంటూ కథలన్నిటికీ మూలం తన అనుభవంలో ఉన్నాయని చెప్పారు. ఈ కథలన్నిటిలో 'నాగలి గాయాల వెనుక' అత్యద్భుతమైన కథ. ముఖ్యంగా కథ చివరలో 'మనం సెన్సిటైజ్ చేయాల్సింది హాలికుల్ని కాదు, పాలకులను అన్న సంభాషణకు దారితీసిన కథను అందంగా అల్లి, చివరలో ఆ సంభాషణను ఉంచటం చక్కటి ఎఫెక్ట్‌నిస్తుంది. కథ విలువను పెంచుతుంది. ప్రతి కథలో ముగింపు సంభాషణలు అత్యద్భుతంగా ఉండి కథ విలువను పెంచుతాయి. ఆ సంభాషణకు దారితీసే కథ నిర్మాణంలో రచయిత ప్రతిభను స్పష్టం చేస్తాయి. ఇందులోని ప్రతి కథ కథా ప్రేమికులను అలరిస్తుంది. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చదవవలసిన కథా సంపుటి ఇది.

**(స్పర్శవేది, రచన: ఎమ్వీ రామిరెడ్డి, వెల: రూ 160, ప్రతులకు: ప్లాట్ నం.ఎ-904, ఫస్ట్‌ఫేస్, రామ్‌కీ గ్యాలెక్స్, నల్లగండ్ల విలేజ్, హైదరాబాద్-500019)**

**- నిర్మోహి**

## అమ్మకు అమరత్వమిచ్చిన రచన

చేయి తిరిగిన రచయిత/రచయిత్రుల ఏ సాహితీ ప్రక్రియకు పూనుకున్నా రాణిస్తారు. అక్షరము అక్షరములోనూ, వారి ప్రతిభద్యోతకమవుతుంది. సిరిసిల్ల రాజన్న జిల్లాకు చెందిన డా॥కందేపి రాణీప్రసాద్ అలాంటి ప్రతిభాశాలురలలో ఒకరు. బాలసాహిత్య సృజనలో 20 వివిధ ప్రక్రియలతో, ఉత్తమ సాహితీవేత్తగా



వందకుపైగా పురస్కారాలను అందుకున్నారు. 43 పిల్లల పుస్తకాలను ప్రచురించారు. పిల్లల హాస్పిటల్ నిర్వహణ, రచనా వ్యాసంగం రెంటినీ ప్రతిభావంతంగా నిర్వహించగల ప్రేమాభిమానాల్ని చాటి చెప్పారు. ఆగస్టు 2020లో దివంగతురాలైన తన తల్లి జ్ఞాపకాల్లో వరుసగా 12నెలలు, 12 అధ్యాయాల్లో ఆమె ఔన్నత్యాన్ని దేశప్రేమను, తనను పెంచి పెద్ద చేసి, విద్యాబుద్ధులు నేర్పిన తీరు, బొడ్డుతాడు తీసేసినా అతుక్కునే ఉన్నంత అనుబంధం వివరించిన తీరుకు పాఠకులు ద్రవించిపోతారు. సాహితీపిపాసురాలైన అంగలకుదుటి గోవిందమ్మ (రచయిత్రి) తల్లి స్మృతిలో రాయబడ్డ ఈ పుస్తకంలో అనుబంధంగా తల్లి సాహిత్యాభిలాష, అభ్యుదయ దృక్పథం బిడ్డల పెంపకం గృహిణిగా ఆమె పాత్ర ఉదాత్తత, పాఠకులను 'ఆర్ద్ర'పరుస్తాయి. తల్లిదండ్రుల యెడల చూపాల్సిన ప్రేమానురాగం, శ్రద్ధ అనుసరణీయమవుతాయి.

**(నా జ్ఞాపకాల్లో అమ్మ, రచన: డా॥ కందేపి రాణీ ప్రసాద్, వెల: రూ100, ప్రతులకు: సృజన్ పిల్లల ఆసుపత్రి, పాతబస్టాండ్, సిరిసిల్ల-505301)** **- కూర చిదంబరం**

## భావ కవిత్వ 'నదీమ'

పరమశివునికి అంకితంగా కవయిత్రి ఈ కవితా సంపుటి అంకితం చేసారు. మన్నెం శారద చక్కటి ముందు మాట రాసారు. ప్రకృతి పట్ల ప్రేమ, సముద్రం, నదులు, దైవచింతన వీరి కవిత్వంలో వుంది. దాదాపు 85 కవితలున్న యీ సంపుటిలో సాగర మధనం, మనం, వర్షం, ఆర్ద్రహృదయ, ధ్యానం, ఒక



భావన, మౌనగీతం, వేదన, యాత్ర, స్థితప్రజ్ఞా, లౌక్యమా, ఊరట, గమనం, బాటసారి, పచ్చచీర, ధరణిపుత్రి, ఎవరీతడు? లాంటి శీర్షికలతో ఉన్నటువంటి కవితల్లో భావసాంద్రత, ఆర్తి, బలమైన అభివ్యక్తి కనిపిస్తాయి. ఇవి పాఠకుల్ని ఆలోచింపచేస్తాయి. మచ్చుకు కొన్ని చూద్దాం! 'విశాల హృదయాన్ని/ విస్తరించావు భూమిపై/ సాగావు గంగవై సాగరాన్ని చేర' (పేజీ:19) అంటారు ఆకాశగంగ కవితలో కవయిత్రి. 'నిశ్చల స్ఫటికము/నిర్మలం నీదు తీరు/ గమనం నీదే స్ఫూర్తి' అంటూ 'గమనం' రాస్తారు. అలాగే 'విహంగం' కవితలో చివరివాక్యాలు అద్భుతంగా వున్నాయి.. 'తెలియాడెనా మనోవిహంగం/ కెరటమై అంబరాన్ని చుంబింప ఎగసె నిరాశకున్ ఎదురీద/ స్వేచ్ఛా విహంగరీతి/ సాగర అంబర నడుమన్ సుమీ!' అంటూ ముగిస్తారు. కవయిత్రి తన మనసులోని భావాలు, ఆలోచనలు, భక్తి, ప్రకృతి అనే అంశాలు కేంద్రంగా సున్నితత్వంతో ఈ కవితలు సాగుతాయి. **(నదీమ, రచన: డా॥శోభ వెన్నం, వెల: రూ100, ప్రతులకు: ప్లాట్ నం.2, సుధా రెసిడెన్సీ, రామన్నపేట్ ఫస్ట్‌లైన్, గుంటూరు-522007)** **- తంగిరాల చక్రవర్తి**

# స్వార్థమే దుర్గుణాలకు మూలం

**డాక్టర ఎన్.బి.సుధాకర్ రెడ్డి,**
సైకాలజిస్ట్



విశాఖపట్నానికి చెందిన సాయిప్రియ భర్తకు మస్కా కొట్టింది. ఆర్కే బీచ్ అలల్లో గల్లంతైనట్టు భ్రమలు కల్పించింది. బంధువులు, స్నేహితులను ఆందోళనకు గురి చేసింది. ప్రభుత్వ సంస్థల్ని పరుగులు పెట్టింది. గాలింపు కోసం ప్రభుత్వ సొమ్ము కోటి రూపాయలు ఖర్చు అయ్యేలా చేసింది. ఆఖరికి తాను సురక్షితంగా ఉన్నట్టు తల్లిదండ్రులకు సంక్షిప్త సమాచారం పంపింది. ప్రియుడితో కలిసి నెల్లూరులో బంధువులకు ప్రత్యక్షమైంది. పత్రికలు, మీడియలో సంచలన కథనాలకు కారణమైంది.

విశాఖపట్నానికి చెందిన సాయిప్రియ శ్రీకాకుళం జిల్లాకు చెందిన శ్రీనివాసరావుకు రెండేళ్ల క్రితం పెళ్లి చేసుకుంది. వివాహానికి ముందే నెల్లూరుకు చెందిన రవితో ప్రేమలో పడిందని తెలిసింది. రెండుసార్లు అతనితో ఎక్కడికో వెళ్లిపోయిందని సమాచారం. తల్లిదండ్రులు ఒత్తిడి చేసి శ్రీనివాసరావుతో ఆమె పెళ్లి చేశారు. ఇద్దరు హైదరాబాద్‌లో కాపురం పెట్టారు. తరువాత కూడా ఆమె రవితో ప్రేమ వ్యవహారం కొనసాగించింది. నాలుగు నెలల క్రితం ఆమె కంప్యూటర్ కోర్సు నేర్చుకోవడానికి విశాఖ వచ్చింది. జులై 25న రెండవ పెళ్లి రోజు కావడంతో శ్రీనివాస్ విశాఖ వచ్చారు. ఉదయం గుళ్లు గోపురాలు తిరిగారు. సాయంత్రం సరదాగా గడపడానికి ఆర్కే బీచ్‌కి వెళ్లారు. ఆ సమాచారం ఆమె ముందే ప్రియుడు రవికి చేరవేసింది. శ్రీనివాస్ ఫోన్‌లో మాట్లాడుతూ ఏమరుపాటుగా ఉన్న సమయంలో రవితో కలిసి వెళ్లిపోయింది. శ్రీనివాస్ తన భార్య తప్పిపోయిందని ఆందోళనకు గురై పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు పొరపాటుగా అలల్లో మునిగిపోయిందని భావించి గాలింపు చర్యలు చేపట్టారు. ఒకటిన్న రోజు తరువాత ఆమె ఆచూకీ తెలిసి ఊపిరి పీల్చుకున్నారు.

పల్నాడు జిల్లాకు చెందిన సతీష్‌బాబు తన స్వార్థ ప్రయోజనాల కోసం ఐదుగురిని పెళ్లి చేసుకున్నాడు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా ఉన్న అతడు ధనకాంక్షతో అమ్మాయిల జీవితాలతో ఆడుకున్నాడు. వివరాలు దాచి, విడాకులు తీసుకున్నట్లు నమ్మించి మోసం చేసి వివాహం చేసుకున్నాడు. డబ్బులు తేవాలంటూ ఒక భార్యను వేధింపులకు గురి చేశారు. లేదంటే 'ప్రేవేట్' చిత్రాలను సామాజిక మాధ్యమాల్లో పెడతానని బెదిరింపులకు దిగారు. ఆఖరికి ఆమె ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు పెట్టి అరెస్టు చేసారు. అతడు గతంలో తనకు వివాహమై విడాకులు తీసుకున్నానని నమ్మించి గుంటూరుకు చెందిన ఓ మహిళను గత జూన్ 16న విజయవాడలోని ఆలయంలో పెళ్లి చేసుకున్నాడు. హైదరాబాద్‌లో కాపురం పెట్టారు. కొద్ది రోజుల తరువాత ఇంటి నిర్మాణం కోసం 80 లక్షల రూపాయలు తీసుకురమ్మని ఆమెపై ఒత్తిడి చేశాడు. డబ్బులు తీసుకురాకపోతే పడక గదిలో ఉన్నప్పుడు తీసిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో పెట్టి డబ్బు సంపాదిస్తానని బెదిరించాడు. వేధింపులు భరించలేక ఆమె బెంగళూరులో ఉద్యోగం కోసం వెళ్లింది. సతీష్‌బాబు అక్కడికి వెళ్లి శారీరకంగా, మానసికంగా హింసించడం ప్రారంభించారు. ఓరోజు ఆమె అతడి చరవాణిని పరిశీలిస్తే అతని పాత బండారం బయటపడింది. తనకంటే ముందు ఆయన నాలుగు పెళ్లిళ్ల చేసుకున్నట్లు గుర్తించింది. దీనిపై గుంటూరు దిశ పోలీస్‌స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**తల్లిదండ్రుల బాగోగులను పట్టించుకోండి..**

సాయిప్రియ, సతీష్‌బాబు వ్యవహారాలు తాజా ఉదంతాలు మాత్రమే. ఇలాంటి స్వార్థపూరిత మనస్తత్వం గలవారు తరచు మనకు సమాజంలో కనిపిస్తుంటారు. స్వార్థం కోసం తల్లిదండ్రులకు అన్నం పెట్టని కొడుకులు అక్కడక్కడా దర్శనమిస్తుంటారు. డబ్బు, వ్యామోహం, విలాసవంతమైన జీవితాల కోసం చాలామంది మానవత్వం మరచి అసాంఘిక శక్తులుగా మారిపోతుంటారు. అవినీతిపరులైన అధికారులు, అక్రమాలకు పాల్పడే ప్రజా ప్రతినిధుల దురాగతాలు కోకొల్లలుగా దర్శనమిస్తుంటాయి. విద్యావంతులైన కొందరు యువకులు దొంగతనాలు, దోపిడీలు, అరాచకాలకు పాల్పడుతుంటారు. తనను ప్రేమించలేదని అమ్మాయిలపై యాసిడ్ పోసేవారు, గొంతుకోసి హత్య చేసేవారు అప్పుడప్పుడు వార్తలకు ఎక్కుతుంటారు. డబ్బుకోసం తల్లినో, తండ్రినో చంపిన దుర్మార్గులు కూడా మన సమాజంలో ఉన్నారు. అన్నదమ్ముల ఆస్తులు కాజేసే ప్రబుద్ధులు అప్పుడప్పుడు కనిపిస్తుంటారు. ఇలాంటి వారిని గురించి విన్నప్పుడు ప్రతివారు స్పందించి రకరకాల

వ్యాఖ్యానాలు చేస్తుంటారు. మీడియాలో కథనాలు వస్తుంటాయి. అయితే ఇలాంటి స్వార్థపర, వ్యామోహపూరిత, అసాంఘిక ప్రవృత్తికి కారణాలు అన్వేషించి, పరిష్కార మార్గాలు సూచించడంలో మనం కొంత వెనుకబడి వున్నామని చెప్పక తప్పదు. మానసిక నిపుణులు, సామాజికవేత్తల కోణంలో చూస్తే ఇవన్నీ వ్యక్తిగత, సామాజిక రుగ్మతలుగా భావించక తప్పదు. ఒక వ్యక్తిలోని మితిమీరిన ఆశ, తపన, అహంకారం, మోహం, ఆవేశం లాంటి ఉద్వేగాలు ప్రతికూల ప్రవర్తనకు దారితీస్తాయి. అవి వ్యక్తిత్వ లోపాలుగా పరిణమిస్తాయి. ఆ దశలో వ్యక్తి మోసకారిగా, అసాంఘిక శక్తిగా మారిపోవడం జరుగుతుంది. వీరిలో కొద్ది శాతం మంది లో ఈ లోపాలు రుగ్మతలుగా పరిణామం చెందుతాయి. అందుకే మానసిక వైద్యులు నిపుణులు పలు వ్యక్తిత్వాలను రుగ్మతలుగా (డిజార్డర్) పేర్కొంటుంటారు. యాంటీ సోషియల్ పర్సనాలిటీ డిజార్డర్, అవాయిడెంట్ పర్సనాలిటీ డిజార్డర్, బార్డర్‌లైన్ పర్సనాలిటీ డిజార్డర్, డిపెండెంట్ పర్సనాలిటీ డిజార్డర్, అబ్సెక్టివ్ కంపల్సివ్ పర్సనాలిటీ డిజార్డర్, ప్యారనాయిడ్ పర్సనాలిటీ డిజార్డర్ లాంటి సమస్యలుగా వర్గీకరించారు. అలాగే వీటిల్లోని పలు లక్షణాలు రుగ్మతలుగా పరిణమిస్తాయి. ఆ దశలో వారిలోని వివేకం నశిస్తుంది. విలువలు క్షీణిస్తాయి. నీతి నియమాలు నశిస్తాయి. తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఎంతకైనా తెగిస్తారు. దానికి అనేక అంశాలు మూలాలుగా ఉంటాయి. పెంపకం, కుటుంబ నేపథ్యం, సామాజిక పరిణామాలు, పరిసరాలు, హార్మోన్ల అసమతుల్యత, వ్యసనాలు, స్నేహితులు లాంటి అనేక అంశాలు ప్రవర్తన, ఉద్వేగాలు, వ్యక్తిత్వం, మానసిక ఆరోగ్యం పై ప్రభావం చూపుతుంటాయి. కాబట్టి సమాజంలో స్వార్థ పరాయణత్వం తగ్గించి, మానవత్వం పెంపొందించేందుకు సామాజిక సంస్థలు, వ్యవస్థలు కృషి చేయాలి.

**లక్ష్యం స్వార్థం కాదు**

నేనే అనే అహం, నాకే దక్కాలనే స్వార్థం, నేను ఎదగాలనే లక్ష్యం ఒకటి కావు. బుద్ధుడు సమాజాన్ని జాగృతం చేయడానికి పలు ఉపదేశాలు ఇచ్చారు. అష్టాంగాలు, పంచశీల సూత్రాలు చెప్పారు. అన్నింటికంటే ముఖ్యంగా కోరిక (తృష్ణ) దుఃఖానికి మూలమన్నారు. అంటే స్వార్థపూరితమైన కోరిక, అత్యాశ మనిషికి అశాంతిని కలిగిస్తాయని చెప్పారు. ఆధునిక వ్యక్తిత్వ వికాస నిపుణులు, నిర్వహణా శిక్షకులు లక్ష్యాలను సాధించమని మార్గనిర్దేశం చేస్తున్నారు. లక్ష్యం కూడా ఒక విధంగా చెప్పాలంటే కోరికే కదా అనేవారున్నారు. సమాజ హితం కోరి, సమాజంతో పాటు తాను కూడా ఎదగాలని కోరుకోవడం ఉన్నత ఆశయం లేదా లక్ష్యంగా చూడాలి తప్ప స్వార్థపూరిత కోరికగా భావించకూడదు. తాను ఎదగాలి, తనతో పాటు సమాజం ఎదగాలని కోరుకోవడాన్ని నిర్మాణాత్మక స్వార్థం అంటాం. లక్ష్యానికి, నిర్మాణాత్మక స్వార్థానికి పరిమితులు ఉంటాయి. వీటిని చేరుకోవడానికి క్రమశిక్షణ, వ్యూహాలు తోడ్పడతాయి. అయితే తృష్ణతో కూడిన స్వార్థం అదుపులేని ఆలోచనలకు



మూలంగా మారుతుంది. తన స్వార్థం కోసం ఎలాంటి అకృతమైనా చేయాలని మనసు తపిస్తుంది. ఆఖరికి నేరాలు, ఘోరాలు చేసేలా ఉద్వేగాలను ప్రకోపిస్తుంది. అంతిమంగా వ్యక్తి తన స్వార్థానికి తానే బలి కావలసి వస్తుంది. సమాజం, చరిత్రలోని అనేక స్వార్థపూరిత సంఘటనలు, పరిణామాలను విశ్లేషిస్తే మనకు అర్థమవుతుంది.

**మానవత్వం పెంపొందాలి**

స్వార్థం పెరిగిపోయి మానవత్వం తరిగిపోతే సమాజం క్రమంగా నశిస్తుందని విజ్ఞులు ఎప్పటినుంచో చెప్తున్నారు. ఆధునిక సమాజంలో వస్తున్న అనేక మార్పులు, పరిణామాలు, ప్రగతి కొందరు వ్యక్తులను స్వార్థపర శక్తులుగా మార్చేస్తున్నాయి. వ్యసనాలు, విలాసాలే జీవితం అనే భ్రమలో పడి కొంత మంది మమతలు, అనురాగాలు, కుటుంబ సంబంధాలకు దూరం అవుతున్నారు. కోట్లకు కోట్లు డబ్బు కూడబెట్టడమే జీవితం అనుకుని అక్రమార్గాలు పడుతున్నారు. సంపదను సృష్టించే వారిని సమాజం హర్షిస్తుంది. సామాజిక నాయకులుగా వారిని కీర్తిస్తుంది. చట్టం, విలువలు పాటిస్తూ సక్రమ మార్గంలో సంపాదించే వారిని అందరూ ఆరాధిస్తారు. దేశ సౌభాగ్య నిర్మాతలుగా వారిని ప్రశంసిస్తారు. అయితే కొంతమంది పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్టు ఎలాగైనా డబ్బు, సంపద సమకూర్చుకోవాలన్న తృష్ణతో ఎదిగినట్టే ఎదిగి కుప్పకూలుతుంటారు. సక్రమ మార్గంలో ఎదిగి లక్ష్యాలు సాధించేవారికి సుఖం, శాంతి, గౌరవం, కీర్తి, ప్రతిష్ఠలు స్వంతమవుతాయి. మితిమీరిన స్వార్థపరులకు సుఖశాంతులు కరువవుతాయి. ఈ సత్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి పరివర్తన చెందితే మంచిది. చాలా మందికి జీవితం పట్ల సరైన అవగాహన ఉండదు. జీవితం అంటే పోరాటం కాబట్టి పోరాడి స్వార్థ ప్రయోజనాలు నెరవేర్చుకోవాలని తపిస్తుంటారు. జీవితం అంటే పోరాటం అనడంలో సందేహం లేదు. ఈ పోరాటం సమాజ హితం కోసం, ధర్మ రక్షణ కోసం చేస్తే మంచిది. స్వార్థపరులు నేను, నాది అన్న ఆలోచనలను మనం, మనది వైపు మళ్లించాలి. సహానుభూతితో ఆలోచించాలి. అంటే ఎదుటివారి స్థానంలో ఉండి తనను గురించి తాను విశ్లేషించుకోవాలి. అంటే ఎదుటి వ్యక్తులు, సమాజం తనను గురించి ఏమనుకుంటున్నదో తెలుసుకుంటే అతనిలో మార్పు మొదలవుతుంది. స్వార్థపూరితం నుంచి బయట పడాలనుకునేవారు మంచి పనులు చేయడం అలవర్చుకోవాలి. సమాజ స్పృహ పెంచుకోవాలి. దురాశ దుఃఖానికి చేటని గుర్తించాలి. కొత్త కొత్త విషయాలు నేర్చుకోవాలి. స్వార్థం తుంచి, మానవత్వం పెంచాలి. బతికినంత కాలం సుఖశాంతులతో వర్ధిల్లాలి. తన చుట్టూ ఉన్న వారిని ప్రశాంతంగా బతకనీయాలి. మానవత్వం పెంచి పోషించాలి. ❐



కథ

# పక్షులే మనకు ఆదర్శం

అప్పాజీపేట అనే గ్రామంలో రామచంద్రుడు, అతని భార్య సరోజన నివసించేవారు. వారు ఎంతో అన్యోన్యమైన ప్రేమజంట. బతకడానికి ప్రతిరోజూ కూలిపనికి పోయేవారు. పెళ్లి అయిన కొత్తలో ఒకరినొకరు అర్థం చేసుకుని హాయిగా సంసారం సాగించేవారు. కొద్ది కాలానికి ఆ దంపతులకు ముగ్గురు పిల్లలు కలిగారు. పని చేయగా వచ్చిన డబ్బులతో అతి కష్టం మీద పిల్లల్ని పోషిస్తూ కుటుంబాన్ని నడిపిస్తున్నారు. పిల్లలు పెరిగి పెద్దవాళ్లు అవుతున్నారు, ఖర్చులు పెరుగుతున్నాయి. సంపాదన అంతంత మాత్రంగానే ఉంది. దీనికితోడు భర్త రామచంద్రుడు కష్టాల ఒత్తిడి పెరగడంతో తాగడానికి అలవాటు పడ్డాడు. ఆ భార్యాభర్తలకు రోజు రోజుకు కుటుంబాన్ని మోయడం తలకు మించిన భారమైంది. ఈలోగా ఇద్దరి మధ్య మాటల యుద్ధం మొదలైంది. ఎడబాటు తడబాటుగా ఉంటున్నారు. భర్త రామచంద్రుడు పట్టీపట్టనట్లుగా ఉంటున్నాడు. భార్య సరోజనపై కుటుంబ భారం పడింది. ఇద్దరూ తరచుగా తగవులాడుకోవడం సాధారణమైంది. సఖ్యత లేక పిల్లల్లోకాడ, తండ్రోకాడ, తల్లోకాడ వేరు వేరుగా పడుకోవడం జరిగేది. తల్లిదండ్రుల పోరు భరించలేని పిల్లలు దిక్కులేనివారయ్యారు. పరిస్థితి చేయి దాటడంతో వేరు వేరుగా ఉంటున్నారు. పిల్లల బాధ్యత అప్పుడప్పుడు తల్లి చూసుకునేది.

ఇలా కొంత కాలం గడిచిన తర్వాత ఒకరోజు రామచంద్రుడు తన ఇంటి ఆవరణలో నివసిస్తున్న పక్షుల జంటను చూశాడు. అవి ఎంతో ప్రేమతో కలిసి మెలిసి ఉంటున్న పరిస్థితిని చూశాడు. అంతేకాకుండా గూటిలోని తమ పిల్లపక్షులకు ఆహారాన్ని అందిస్తున్న సంగతి గమనించాడు. రామచంద్రుడి మనసులో ఏదో తీరని వెలితి అనిపించింది. మాటలు లేని పక్షులు ఎంతో అల్లారుముద్దుగా ఉంటున్న తీరు చూసి సిగ్గుపడ్డాడు. భార్య దగ్గరికి వెళ్లి క్షమించమని కోరాడు. ఇకనుండి తాగడం మానేస్తానని, ఇద్దరి మధ్య మాటల యుద్ధానికి స్వస్తి పలుకుదామని, ఇకనుండి మన పిల్లల్ని ప్రేమగా చూసుకుందామని ఇద్దరూ అనుకున్నారు. ఇక అప్పటి నుండి ఆ దంపతులిద్ద రూ మళ్లీ పోట్లాడకుం డా ఎంతో చక్కగా ఉంటూ పిల్లల్ని చక్కగా చదివిస్తూ జీవనం సాగించారు. తల్లిదండ్రుల్లో వచ్చిన మార్పుకు ఆ పిల్లలు ఎంతో సంతోషపడ్డారు. ఇరుగు పొరుగువారు కూడా ఆనందం వ్యక్తం చేశారు.



**- కోమటి రెడ్డి బుచ్చిరెడ్డి**

### కొన్ని సూచనలు..

పిల్లలూ! బాగున్నారా? వర్షాలు చాలా ఎక్కువగా కురుస్తున్నాయి కదూ! మరి మీరు ఎక్కువగా వర్షంలో తడవకుండా చూసుకోవాలి. లేకపోతే అనారోగ్యానికి గురవుతారు. ఆటలు ఆడుకునేట ప్పుడు నీటిగుంటలకు దూరంగా ఉండాలి. అలాగే వర్షంలో బయటికి రాకూడదు. కరెంటు స్తంభా లను తాకరాదు. స్కూలు వెళ్లేటప్పుడు చాలా జాగ్రత్తగా పరిసరాలను గమనిస్తూ వెళ్లాలి. పట్ట ణాల్లో అయితే మ్యాన్‌హోల్స్ ఉంటాయి. రెయిన్ కోట్‌ను తప్పనిసరిగా మా బ్యాగ్‌లలో ఉండాలి. ఉరుములు వస్తున్నప్పుడు చెట్లకింద నిలబడ కూడదు. గుంతల జోలికి వెళ్లకూడదు.

## బాలగేయం

### ఉంటేనే అందం..



నింగిలో తారలు
పుడమిలో తరువులు
ఉంటేనే అందం
గృహంలో బాలలు
కొలనులో కలువలు
చెరువులో జలములు
ఉంటేనే అందం
మోములో నగవులు
పూవుల్లో తావులు
మనిషిలో విలువలు
ఉంటేనే అందం
ఇంటిలో పెద్దలు
విహరించే పక్షులు
ప్రవహించే యేరులు
ఉంటేనే అందం
మురిపించే పిల్లలు

**- గద్వాల సోమన్న**



## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- కె.వాసుదేవ్,** వరంగల్

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. ఐ.ఎ.ఇ.ఎ అంటే ఏమిటి?

**జవాబు: వాసుదేవ్!** ఐక్యరాజ్యసమితి(యుఎన్ఒ)కి అనుబంధ సంస్థగా ఉండే 'ఐ.ఎ.ఇ.ఎ.' అంటే ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ. దీని ప్రధాన కార్యాలయం ఆస్ట్రియా రాజధాని వియన్నాలో ఉంది. ఈ సంస్థ 1957లో జులై 29న ఆవిర్భవించింది. ఇది ఐ.రా.స.కి అనుబంధమే అయినప్పటికీ స్వంతంగా నిర్ణయాలు తీసుకోగలదు. అణుశక్తిని శాంతియుత ఉపయోగాలకి వాడేందుకు ఈ సంస్థ అంతర్జాతీయ స్థాయిలో కృషి చేస్తోంది. యుద్ధాల్లో అణుశక్తిని వాడితే అంతా నాశనమే కనుక అణుపరిశోధన, అభివృద్ధి మానవుని శక్తి అవసరాలను తీర్చే దిశగా సాగాలని కృషి చేస్తున్న సంస్థ ఇది.

**- ఎస్.స్వామినాథన్,** కోహెడ

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. కంటికీ మెదడుకూ సమన్వయం అన్ని సందర్భాల్లో ఉండి తీరాల్సిందేనా?

**జవాబు: స్వామి!** తప్పనిసరిగా ఉంటుంది, వుండితీరాలి. ఉదాహరణకు నడక. కళ్లు తెరిచి సాధారణంగా నడుస్తున్నప్పుడు చూపు వల్ల కలిగే అప్రమత్తతో మనతో నిమిత్తం లేకుండానే సవ్యమైన నడక నడుస్తాం. కళ్లకు గంతలు కట్టుకొని నడిస్తే మన మెదడులో మార్పు కలిగి, ఆ మార్పు ప్రభావంతో అపసవ్యంగా నడుస్తాం. నేరుగా అసలు నడవలేం. కాళ్లు తడబడి, వంకర టింకరగా నడిచే పరిస్థితి వస్తుంది. ఇందుకు ప్రధాన కారణాలు రెండు. మొదటిది: మన మెదడు కళ్లకు మార్గాన్ని నిర్దేశించలేదు. రెండవ కారణం: మన శరీర నిర్మాణ వ్యవస్థ సహజం గానే అసమానతగా ఉండడంతో ఏదో ఒక పక్కకు ఒరిగిపోతాం. కళ్లకు మెదడుకు అనుసంధానం లేకపోవడంతోనే ఇది జరుగుతుంది. మన శరీరం బ్యాలన్స్ తప్పుతుంది. నడక అపసవ్యంగా మారుతుంది.

నిత్య స్మరణీయ నామం నమఃశివాయ! పరిపూర్ణ భావంలో నామాన్ని స్మరిస్తే చాలు.. భక్తుల మనోభీష్టాలను నెరవేర్చే పరమశివుడు భూలోకంలో అనేక ప్రాంతాలలో స్వయంభూలింగ రూపంలో కొలువుతీరి వున్నారు. మరికొన్ని చోట్ల అవతార పురుషులు, మహర్షులు, భక్తులు శతాబ్దాల కిందట ప్రతిష్ఠించారు. అవన్నీ నేడు ప్రసిద్ధ శైవ క్షేత్రాలుగా పేరొందాయి. విజయవాడ యనమలకుదురు గ్రామంలోని "మునిగిరి" మీద కొలువైన శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం రెండవ కోవలోకి వస్తుంది. పురాణ కాలంలో అనేకమంది మహర్షులు పవిత్ర కృష్ణా నదీ



# సహస్రాధిక మునులు తపస్సు చేసిన 'మునిగిరి'

తీరంలోని ఈ పర్వతం మీద తపస్సు చేయడం వలన ఆ పేరు, సహస్రాధిక మునులు తపస్సు చేసిన కొండ ఉన్న ఊరుగా 'వేయి మునుల కుదురు'గా పిలిచేవారని అంటారు. అదే కాలక్రమంలో 'యనమలకుదురు'గా రూపాంతరం చెందినట్లుగా తెలుస్తోంది.

ఏ దివ్య కారణం వలన లేదా ఏ భక్తుణ్ణి కాపాడటానికి భక్తసులభుడు ఉద్భవించారో తెలియదుగానీ మహావిష్ణు ఆరో అవతార స్వరూపమైన పరశురాముడు భూమిలోకి కుంగిపోయిన తన గురువైన మహేశ్వర లింగాన్ని గుర్తించి పునఃప్రతిష్ఠ చేసినట్లుగా స్థల పురాణం చెబుతోంది.

తదనంతర కాలంలో అనేక మంది రాజులు, పాలకులు, జమీందారులు సామాన్య భక్తులు ఆలయ అభివృద్ధికి చేసిన కృషి వల్ల నేటి రూపం సంతరించుకుంది.

పరశురాముడు, శ్రీరాముడు మొదలైనవారు ఈ క్షేత్రాన్ని సందర్శించి లింగరాజును సేవించినట్లుగా తెలుస్తోంది.




ఇద్దరు రాముల సేవలను అందుకున్న లింగరూపుడు శ్రీరామలింగేశ్వరునిగా ప్రసిద్ధి చెందారు. ఆరు వందల అడుగుల ఎత్తయిన మునిగిరిపైకి చేరుకోవడా నికి సోపాన మార్గం, వాహన మార్గం ఏర్పాటు చేశారు. క్షేత్ర పాలకుడైన అంజనాసుతుని విరాట్ రూపం ఆహ్వానం పలుకుతున్న ట్లుగా కనపడుతుంటుంది.

పైనుండి సువిశాల విజయవాడ నగరాన్ని, పక్కనే ప్రవహించే కృష్ణా నదిని, శ్రీ కనకదుర్గమ్మ కొలువైన ఇంద్ర కీలాద్రిని వీక్షించడం ఒక చక్కని అను భూతి. స్వచ్ఛమైన గాలి, ఆ పైన భగవంతుని సన్నిధానం.

పర్వత పైభాగాన తొలి యం శ్రీ గణపతిది. ప్రథమ పూజితుణ్ణి సేవించుకొని ముందుకు సాగితే వచ్చే సన్నిధి హరిహర పుత్రుడైన శ్రీ ధర్మశాస్తది. కైలాస నాథుడు ఇక్కడ కొలువై ఇద్దరు రాములు పూజలందుకోవడం వలన ఈ క్షేత్రాన్ని శివకేశవ క్షేత్రంగా అభివర్ణించడం వలన ఇక్కడ శ్రీ ధర్మశాస్త ఆలయం ఉండటం ఎంతైనా సమంజసం, ఆనందదాయకం, దర్శనీయం. శబరీ గిరీశుని దర్శించుకొని ముందుకు వెళితే క్షేత్ర పాలకుడైన శ్రీ దాసాంజనేయుని సన్నిధి వస్తుంది. శంకర అవతారం అయిన వాయునందనుడు రామభక్తుడు. ఈయన క్షేత్ర పాలకుడు కావడం మరింత సముచితం.





కొద్దిగా ఎత్తయిన గట్టు మీద ముకుళిత హస్తాలతో స్థానక భంగిమలో కొలువైన హనుమంతుని దర్శించుకొని పక్కనే ఉన్న శ్రీ నాగేంద్ర స్వామి పుట్టకు వచ్చి మొక్కి ప్రధాన ఆలయం వైపుకి వెళితే ఉత్తర ద్వారానికి ఒక పక్కన యాగశాల ఓ పక్కన వేదిక కనిపిస్తాయి.



నూతనంగా పునః నిర్మించబడిన ప్రధాన ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశిస్తే తూర్పు ముఖంగా శ్రీ రామలింగేశ్వర స్వామి పక్కన దక్షిణ ముఖంగా అమ్మవారు శ్రీ పార్వతీదేవి కొలువై ఉంటారు. ముఖ మండపంలో నందీశ్వరుడు గర్భాలయ ద్వారానికి ఇరుపక్కలా ద్వార పాలకులు కనిపిస్తారు.

గర్భాలయంలో పెద్ద లింగ రూపంలో శ్రీ రామలింగేశ్వర స్వామి దర్శనమిస్తారు. స్వామి అభిషేక ప్రియుడు. అందుకే ప్రతిరోజూ అభిషేక సేవల పాల్గొనడానికి తరలివస్తుంటారు.

చతుర్భుజిగా వరద, అభయ హస్తాలతో స్థానక భంగిమలో శ్రీ పార్వతీదేవి యన మనోహర అలంకరణలో దర్శనమి స్తారు. శాస్త్ర ప్రకారం నిత్య అభిషేకాలు, పూజలు నిర్వర్తించే ఈ ఆలయంలో అన్ని పర్వదినాలను వైభవంగా నిర్వహిస్తారు. వినాయక చవితి, సుబ్రహ్మణ్య షష్ఠి, మండల పూజ, నవరాత్రులతో పాటు మూడు రోజుల పాటు శివరాత్రి మహోత్సవాలు అత్యంత ఘనంగా జరుగుతాయి. జిల్లా నుండే కాక రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు తరలివచ్చే శివరాత్రి ఉత్సవాలలో భక్తులు మేలైన జాతి వృషభాల మీద విద్యుత్ దీపకాంతులతో ప్రత్యేకంగా అలంకరించిన ఎత్తైన ప్రభలు ప్రధాన ఆకర్షణ.

శివరాత్రి రోజున ఉపవాసం, శివ నామస్మరణ, ఉపవాసం, మరుసటి రోజు శివ కళ్యాణం రమణీయంగా జరుగుతాయి. మూడో రోజున వసంతోత్సవాలను ఉల్లాసంగా నిర్వహిస్తారు. గ్రామ ప్రజలంతా ఈ మూడు రోజులు తమ ఇంటి పండుగగా భావించి పాల్గొంటారు. శ్రీ రామలింగేశ్వర స్వామిని ఒక్కసారి దర్శిస్తే వెయ్యి మార్లు దర్శించిన ఫలితం ఉంటుంది అన్న తరతరాల విశ్వాసంతో ప్రతిరోజూ ఎందరో భక్తులు స్వామివారి దర్శనానికి సేవలకు వస్తుంటారు.

విజయవాడ పట్టణ రైల్వే స్టేషన్ నుండి, బస్సు స్టాండు నుండి ఆటోలలో సులభంగా శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామివార్ల కొలువరిన 'మునిగిరి' ఉన్న యనమలకుదురు ఊరు సులభంగా చేరుకోవచ్చు.

విజయవాడ నగరంలో తప్పనిసరిగా సందర్శించవలసిన వాటిల్లో ఈ ఆలయం ఒకటి.

**- ఇలపావులూరి వెంకటేశ్వర్లు**

# రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి. రచనలు పంపించాల్సిన **చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**
sunmagvaartha@gmail.com

కథ

# ఇరుగు పొరుగు

**యనమండ్రి భానుమూర్తి**

**"ఏమండీ,** పక్కింటివాళ్లు లేటెస్ట్ మోడల్ ఫ్రిడ్జ్ కొన్నారు. నిన్నే వచ్చిందట. సువర్ణ రమ్మని పిలిస్తే వెళ్లి చూసొచ్చాను" అంది అపర్ణ.

"మంచిదేగా, ఏ కంపెనీ అట" అడిగాడు గంగాధర్ పేపరు చదువుతూ.

"శాంసంగ్ 810 లీటర్లు. చాలా పెద్దగా ఉంది. ఎన్ని సదుపాయాలున్నాయో. చాలా బాగుంది" పొగడ్తల వర్షం కురిపించింది.

"డిజిటల్ ఇన్వెర్టర్ టెక్నాలజీ, మ్యాజిక్.. " ఆనందంతో తబ్బిబ్బవుతోంది అపర్ణ.

"ధర ఎంతో" కుతూహలంగా అడిగాడు గంగాధర్.

"రెండు లక్షల డెబ్బై వేలు" కళ్లింత చేసుకొని చెప్పింది అపర్ణ.

"ఏవిటి.. ఫ్రిడ్జ్ ఖరీదా?" ఆశ్చర్యపోయాడు గంగాధర్.

"అవును మరి. మనమేమైనా కొంటామా, పెడతామా.. ధరలు తెలియడానికి. మనింట్లోనూ వుంది ఓ ముష్టి ఫ్రిడ్జి. దాన్ని కొని పదేళ్లయింది. కరెంటు దండగ తప్ప దేనికీ పనికిరాదు. దానిష్టమొచ్చినప్పుడు పాడైపోతూ వందలు వందలు ఖర్చు పెట్టిస్తోంది. పైగా అప్పుడప్పుడు షాకులు కొడుతోంది. ఎన్నిసార్లు మార్చమని చెప్పినా మీరేమో పట్టించుకోరు" అంది అపర్ణ.

"అదికాదే, ఫ్రిడ్జికే అంత డబ్బులు తగలెయ్యాలా?" ఉడుక్కుంటూ అన్నాడు గంగాధర్.

"వున్నవాళ్లు వున్నట్లే వుంటారు. మనలాగా ప్రతిదాన్లో రాజీపడరు. ప్రతి పైసా, పైసా చూసుకోరు. వాళ్ల దర్జా వేరు. దర్పం వేరు. అయినా దేనికైనా పెట్టిపుట్టాలి" అదను దొరికింది కదా అని ఎత్తిపొడిచింది అపర్ణ.

ఇంతకీ అసలు విషయం.. గంగాధర్, పక్కింటి లక్ష్మీపతి ఇద్దరూ ఒకే ఊరివాళ్లు. ఒకే కాలేజీలో చదువుకున్నారు. ఇద్దరూ కష్టపడి చదవటం వల్ల డిగ్రీ అయిన వెంటనే ఉద్యోగాలు వచ్చాయి. అదీ ఏ.జీ. ఆఫీసులో. ఇకనేం? హైదరాబాద్‌కి మకాం మార్చేశారు. ఇద్దరూ ఒకే సంవత్సరంలో పెళ్లి చేసుకున్నారు. ఇద్దరికీ చెరో ఇద్దరు పిల్లలు. ఏ.జి.ఆఫీసు సొసైటీవాళ్ల పుణ్యమా అని నూట యాభై గజాల స్థలంలో ఇద్దరూ చెరొక ఇల్లు కట్టుకున్నారు. కథ అంతవరకు బాగానే ఉంది. కానీ అసలు విషయం అక్కడినుంచే మొదలైంది.

గంగాధర్ మొదటి నుంచి సాత్విక స్వభావి. దైవభక్తి, పాపభీతి ఎక్కువ. ఆఫీసులో కూడా చాలా నిక్కచ్చిగా ఉండేవాడు. అవినీతికి లొంగేవాడు కాదు. గంగాధర్ టేబుల్ మీదకు ఏ ఫైలు వచ్చినా వెళ్లింది అంటే దాంట్లో అన్నీ కరెక్ట్‌గా ఉండాలి. లేకపోతే వెంటనే తిప్పి పంపిస్తాడు. అందుకే గంగాధర్ అంటే ఆఫీసులో అందరూ జాగ్రత్తగా ఉండేవారు. కానీ లక్ష్మీపతిది కొంచెం దుడుకు స్వభావం. చిన్నప్పుడు కష్టాలు పడ్డాం కదా అని, పెద్దయిన తరువాత ఎక్కువ సుఖపడదాం అనుకునేవాడు. దానికి తగ్గ మార్గాలు కూడా వెతుక్కునేవాడు. మెల్లమెల్లగా ఆఫీసులో లక్ష్మీపతి అంటే ఒక దురభిప్రాయం ఏర్పడింది. పై ఆఫీసర్లని కాకా పట్టి పనులు చేయించుకునేవాడు. లక్ష్మీపతిని పట్టుకుంటే పనులు వెంటనే అవుతాయనే అభిప్రాయం అందరికీ వచ్చింది. అందుకనే లక్ష్మీపతికి డబ్బు ఇబ్బడిముబ్బడిగా వచ్చిపడేది.

ఇంకేం... ఇంటిని ఇంద్రభవనంలాగా తయారు చేసుకున్నాడు. ఇల్లు కొన్న ఐదు సంవత్సరాలకే పైన రెండు అంతస్తులు వేసి అద్దెకు ఇచ్చాడు. లక్ష్మీపతి భార్య సువర్ణ కూడా గొప్పింటినుండే వచ్చింది కాబట్టి భర్త జీతంకన్నా ఎక్కువ ఆదాయం ఎందుకు వస్తోందని ఎప్పుడూ అడగలేదు. అడగాలనిపించలేదు, లక్ష్మీపతి చెప్పనూ లేదు. పిల్లలిద్దరినీ మంచి స్కూల్లో చేర్పించాడు. ప్రతిరోజూ స్కూల్ బస్సు వచ్చి లక్ష్మీపతి పిల్లల్ని తీసుకెళ్తుంటే అపర్ణ చాలా సార్లు బాధపడేది. అది ఏసీ బస్సు. పిల్లలు బస్సెక్కాక "బై మమ్మీ" అని సువర్ణకు చెప్తుంటే అపర్ణ ఉడుక్కొనేది. తన పిల్లలూ ఉన్నారు. ఓ మోస్తరు స్కూల్లో చదువుతున్నారు. గంగాధర్‌తో ఈ విషయం చెప్తే–



"మన తాహతుకు తగ్గట్లు ఉండాలి. అంతేకాని పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు ప్రవర్తించకూడదు. లోకంలో ఎంత మందో గొప్పవాళ్లుంటారు. అందరితో పోటీ పడగలమా. మనకున్నదాంట్లో మనం తృప్తిగా జీవించాలి" అనేవాడు.

భర్తతో వాదించి, వాదించి విసుగెత్తిపోయింది అపర్ణ. ఒకరోజు రాత్రి భోజనాలయిన తరువాత విషయం మెల్లగా కదిపింది "ఏమండీ, లక్ష్మీపతి అన్నయ్యవాళ్లు చూడండి.. ఎలా వున్నారో. మీరూ, అన్నయ్య ఒకే చదువు చదివారు. ఒకేసారి ఉద్యోగాలొచ్చాయి.

ఒకే ఆఫీసులో పని చేస్తున్నారు. కానీ ఎంత వ్యత్యాసం. నాకు మాత్రం సువర్ణలాగా గొప్పగా వుండాలని ఉండదా? పోనీ మన గురించి కాకపోయినా పిల్లలను గొప్పగా పెంచాలి కదా" గంగాధర్‌లో ఏమైనా చిన్న మార్పు వస్తుందనే ఆశతో, గంగాధర్ మొహం వైపు చూస్తూ అడిగింది అపర్ణ.

అపర్ణకేసి జాలిగా చూసాడు గంగాధర్. "మనం మాత్రం పిల్లలను జాగ్రత్తగా పెంచడం లేదా? మంచి స్కూల్లోనే చేర్పించాం. వాళ్లు బాగానే చదువుతున్నారు కదా. ఇక మనం అంటావా.. సొంత ఇల్లు వుంది. ఇంట్లో లక్ష్మీపతి వాళ్లకున్నంత కాకపోయినా అన్ని వస్తువులున్నాయి కదా. ఇంకేం కావాలి? ఆశ వుండొచ్చుగానీ మితిమీరిన ఆశ వల్ల నష్టమే తప్ప లాభం లేదు" అన్నాడు గంగాధర్.

రోజూ ఇదే తంతు. తను ఏదో చెప్పాలని ప్రయత్నించడం, భర్త కాదనడం. ఇక భర్తకు చెప్పి ప్రయోజనం లేదని నిర్ధారించుకొని నిద్రలోకి జారుకుంది అపర్ణ.

అపర్ణ వైపు చూసాడు గంగాధర్. ప్రశాంతంగా నిద్రపోతోంది. మధ్య తరగతి భార్య. గొప్పగా ఉండాలనుకోవడం తప్పా భార్య అడిగినదాంట్లో తప్పు లేదు. కానీ ప్రతి వ్యక్తికి కొన్ని వ్యక్తిగత నియమాలుంటాయి. వాటిని దాటితే వచ్చే ఫలితాలను ఎదుర్కోవడానికి తయారుగా ఉండాలి. సమాజం తప్పు చేసి దొరకనంతవరకు అందరిని ఒకేలా చూస్తుంది. ఒకవేళ దొరికిపోతే దొంగలాగా చూస్తుంది. అప్పుడు సమాజం దృష్టిలోనూ, దేవుడి దృష్టిలోనూ చెడ్డవాడవుతాడు. ఆ పరిస్థితి రాకూడదు. ఎవరు ప్రలోభపెట్టినా తన మార్గంలోనే వెళ్లడం మంచిది. ఆలోచిస్తున్నాడు గంగాధర్.

నిద్ర ముంచుకురావడంతో తనూ పడుకున్నాడు. మరుసటి రోజు ఆదివారం కావటంతో ఆలస్యంగా నిద్ర లేచాడు గంగాధర్. బయట ఏదో హడావిడిగా ఉండటంతో బయట గేటువద్దకు వచ్చాడు. లక్ష్మీపతి ఇంటిముందు ఒక మినీ లారీ ఆగివుంది. దాన్లోనుంచి కొందరు సామాన్లు దించుతున్నారు.

అపర్ణ అప్పుడే విషయం కనుక్కున్నదిలా ఉంది. "ఏవండోయ్! అన్నయ్యగారు మినీ హోమ్‌థియేటర్ తెప్పించారు. ఇక సినిమాలన్నీ మంచి మ్యూజిక్‌తో ఇంట్లోనే చూడొచ్చట" అంది. ఇక ఆ మినీ థియేటర్ గురించి కొన్ని రోజులు చెబుతుందేమో, మనసులోనే అనుకున్నాడు గంగాధర్.

అనుకున్నట్లే సాయంత్రం మినీ థియేటర్ ప్రారంభానికి పిలిచారు లక్ష్మీపతి వాళ్లు. పిల్లలతో సహా లక్ష్మీపతిఇంటికి వెళ్లాడు గంగాధర్. చూడ్డానికి రెండు కళ్లు చాలవు. ఒక పెద్ద గదిని థియేటర్ కింద మార్చేశారు. ఆర్టిఫిషల్ సీలింగ్, కొత్త సోఫాలతో గది, ఒక చిన్న సినిమా హాలులాగా ఉంది. పెద్ద తెర, ఆడియో సిస్టమ్స్ రంగు రంగుల దీపాలు.. చిన్న స్వర్గంలా వుంది. మొదటి రోజున మంచి డిజిటల్ మ్యూజిక్ వున్న ఇంగ్లీష్ సినిమా వేశారు. గంగాధర్ పిల్లలు లక్ష్మీపతిఇంటిని వదలలేదు. రాత్రి మంచి పార్టీ కూడా ఇచ్చాడు లక్ష్మీపతి. ఆ సాయంత్రం ఎంతో సరదాగా గడిచిపోయింది.

గంగాధర్ కుటుంబం ఇంటికి తిరిగి వచ్చేసరికి రాత్రి పదైంది. 'ఏం వైభవం.. ఏం దర్జా.. బతికితే అలా బతకాలి..' అనుకుంది అపర్ణ. ఆ రోజు రాత్రి ఉత్సాహాన్ని ఆపుకోలేక మళ్లీ భర్తను అడిగింది.

"చూసారా అన్నయ్యవాళ్లు నెలకొక వస్తువును తెస్తున్నారు. నేనెన్నిసార్లు చెప్పినా మీరు మారటం లేదు. ఈ రోజుల్లో ఇదంతా మామూలే. మీకు తెలియంది కాదు. అవినీతి ఎక్కడ లేదు. మనం కూడా సుఖంగా ఉండాలనుకోవడం తప్పా? మనకొచ్చే ఈ జీతంతో నెలంతా గడవటమే గగనంలా వుంది, ఆలోచించండి" అంది అపర్ణ.

"మనం ఈ విషయం గురించి చాలాసార్లు మాట్లాడుకొన్నాం. ఒకసారి మనిషి అవినీతికి పాల్పడితే అతను మరణించినట్లే. నీకీవిషయం ఎంత చెప్పినా అర్థంకాదుగానీ ఇక పడుకుందాం" అని గదిలోకి వెళ్లాడు గంగాధర్.

ఇక చేసేదేమీలేక అపర్ణ కూడా పడుకుంది.

కొన్నాళ్లు గడిచాయి.

ఇంతలో కొత్త సంవత్సరం వచ్చింది. ఆ రోజున లక్ష్మీపతి టొయోట ఫార్చ్యూనర్ కారు కొన్నాడు. దాదాపు ముప్పై లక్షలైంది. తళతళా మెరుస్తోంది. లక్ష్మీపతి కారు ఇంటికి తెచ్చేసరికి పిల్లలు కేరింతలు కొట్టారు. సువర్ణ వచ్చి గంగాధర్ కుటుంబాన్ని భోజనానికి పిలిచింది.

భోజనాలైన తరువాత రెండు కుటుంబాలు కలిసి హోమ్ థియేటర్‌లో ఇంకో మంచి సినిమా చూసారు. అన్ని వేడుకలు పూర్తయి గంగాధర్ కుటుంబం ఇంటికి వచ్చేసరికి రాత్రి తొమ్మిదయింది.

"చూసారా.. అన్నయ్యగారు ఈసారి మంచి కారు కొన్నారు. మనకు కారు లేకపోతే పోయే, మంచి స్కూటర్ కూడా లేదు కదా. ఇలాగయితే ఎలాగండి. నేనెప్పుడూ అడగటమేనా. మీకేమీ అనిపించడంలేదా" భర్తను అడిగింది అపర్ణ. నిజమే! లక్ష్మీపతితో పోలిస్తే తాను ఏమీ లేనివాడు. ఆఫీసులో తను నిజాయితీగా ఉండటం వల్ల రావలసిన ప్రమోషన్లు కూడా రాలేదు. లక్ష్మీపతేమో పై అధికారుల అండదండలతో సెక్షన్ హెడ్ అయ్యాడు. పోనీ లక్ష్మీపతితో పోటీ పడి ఏమైనా కొందామా అంటే తన ఆర్థిక పరిస్థితి అందుకు సహకరించదు. అప్పులు చేస్తే తీర్చలేక ఇబ్బంది పడాలి. ఏవండీ! అన్న అపర్ణ పిలుపుకి ఆలోచనల సుడిగుండం నుంచి బయట పడ్డాడు గంగాధర్. సరేలే అపర్ణా! వచ్చే నెల కొత్త స్కూటర్ కొందాంలే. సర్దిచెప్పాడు గంగాధర్.

"చూసారా.. అన్నయ్యగారు ఈసారి మంచి కారు కొన్నారు. మనకు కారు లేకపోతే పోయే, మంచి స్కూటర్ కూడా లేదు కదా. ఇలాగయితే ఎలాగండి. నేనెప్పుడూ అడగటమేనా.

మరుసటిరోజు గంగాధర్ ఆఫీసుకి వచ్చాడు. లక్ష్మీపతి తన క్యాబిన్‌లో ఎవరితోనో గొడవ పడుతున్నాడు. అవతలి వ్యక్తి గట్టిగా మాట్లాడుతున్నాడు.

"లక్ష్మీపతీ! నేనెవరో తెలుసుకుని మాట్లాడు. నా ఫైల్ శాంక్షన్ గురించి నీకు రెండు నెలల కిందే డబ్బులు ఇచ్చాను. చాలా సార్లు తిప్పేస్తున్నారు. కానీ ఫైల్ శాంక్షన్ చేయటం లేదు. రాష్ట్రమంత్రి మా దూరపు చుట్టం. నీకు రెండు రోజులు గడువిస్తున్నాను. ఫైలైనా శాంక్షన్ చేయించు, లేదా డబ్బులు తిరిగి ఇచ్చేయి. లేకపోతే నేనేం చేస్తానో నాకే తెలీదు" అంటూ విసవిసా బయటకు నడచి వెళ్లిపోయాడు.

మిగతా ఉద్యోగులు లక్ష్మీపతికి సర్దిచెబుతున్నారు. ఇదంతా దూరం నుంచి చూస్తున్నాడు గంగాధర్. తను కూడా లక్ష్మీపతికి సర్దిచెపితే అతను

బాధపడతాడు. అందుకనే ఏమీ తెలియనట్లు తన క్యాబిన్‌లోకి వెళ్లిపోయాడు గంగాధర్. గొడవ సద్దుమణిగి అందరూ ఎవరి పనుల్లో వాళ్లు మునిగిపోయారు. ఇది జరిగిన వారం రోజుల తరువాత ఒకరోజు లక్ష్మీపతి లంచం తీసుకుంటూ ఏ.సి.బి.వాళ్లకు దొరికిపోయాడు. ఆఫీసులో అంతా గందరగోళం. అందరూ చెవులు కొరుక్కుంటున్నారు. "ఇది జరుగుతుందని నేను ముందునుంచీ అనుకుంటున్నాను" అని ఒకరు; "పాపం పండితే ఇలాగే ఉంటుంది" అని ఇంకొకరు; "దూకుడెక్కువైంది" అని మరొకరు... ఎవరికి తోచినట్లు వాళ్లు అనుకుంటున్నారు.

లక్ష్మీపతికి ముచ్చెమటలు పట్టాయి. ఇంతవరకు ఆకాశంలో వున్న తను పాతాళంలోకి పడిపోయాడు ఏ.సి.బి. వాళ్ల రిపోర్టు మేరకు లక్ష్మీపతిని సస్పెండ్ చేశారు. ఇంటి మీద కూడా రైడ్ అయింది. ఒకేసారి ఐదుగురు ఏ.సి.బి. ఆఫీసర్లు వచ్చి రాత్రి పది గంటలదాకా సెర్చ్ ఆపరేషన్స్ చేసి లక్షలకొద్దీ డబ్బు, బంగారం, ఇంటిపత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఆ మరుసటి రోజు సువర్ణ ఉదయాన్నే గంగాధర్ ఇంటికి వచ్చింది. కళ్లు ధారాపాతంగా వర్షిస్తున్నాయి.

"అన్నయ్యా! నువ్వే ఎలాగైనా మా వారిని కాపాడాలి. మితిమీరిన ఆశతో ముందూ వెనకా చూడకుండా అక్రమంగా డబ్బు సంపాదించేవాళ్లకి చివరికి ఇదే జరుగుతుంది" భోరున ఏడుస్తోంది సువర్ణ.

"ఊరుకో అక్కా, జరగాల్సింది జరిగిపోయింది. ఇప్పుడు బాధపడే దానికన్నా దీని నుంచి ఎలా బయటపడాలా అని ఆలోచిస్తే బాగుంటుంది. ఏమండీ, మీకేమైనా వీలుంటే సహాయం చేయండి" అంది అపర్ణ.

"సహాయం చేయడానికి ఇదేమీ చిన్న విషయం కాదు. ఏ.సి.బి.వాళ్లు చాలా పకడ్బందీగా కేసు పెడతారు. పూర్తి వివరాలు తెలిసేదాకా ఏమీ చేయలేం" అన్నాడు గంగాధర్. సువర్ణ చాలాసేపు అపర్ణను బతిమిలాడి ఇంటికి వెళ్లిపోయింది. సువర్ణని అలా ఏడుస్తూ ఎప్పుడూ చూడలేదు. వాళ్లేమిటి, వాళ్ల దర్జా ఏమిటి.. దర్పం ఏమిటి.. అనుకునేది తను. ఇంతలో ఎంత మార్పు! ఆలోచిస్తోంది అపర్ణ.

"చూసావా అపర్ణా.. లక్ష్మీపతి వాళ్లింట్లో పరిస్థితి ఎంత హఠాత్తుగా మారిందో. ఇప్పుడు నీకు తెలిసిందా నీతికి, అవినీతికి మధ్య వున్న లక్ష్మణరేఖ దాటితే ఏం జరుగుతుందో. నువ్వు నన్ను చాలా సార్లు అవినీతికై ప్రోత్సహించావు. కానీ మన అదృష్టంకొద్దీ నాకు చెడుబుద్ధి కలగలేదు. లేకుంటే లక్ష్మీపతిలాగే నేను కూడా సస్పెండ్ అయి ఉండేవాణ్ణి. అప్పుడు మన పరువేమౌతుంది. బంధువుల దృష్టిలో మనం ఎంత దిగజారుతామో ఆలోచించావా.



నాకు మాత్రం కారు కొనాలని లేదా, కొనేముందు కొనగల సామర్థ్యం ఉందా లేదా అని ఆలోచించుకోవాలి. అంతేకానీ అప్పులు చేసో లేక లంచాలు తీసుకునో కార్లు కొనుక్కోకూడదు. ఇది జీవిత సత్యం" అన్నాడు, గంగాధర్.

ఇన్నాళ్లు లక్ష్మీపతే ఆకాశమంత ఎత్తులో వున్నాడనుకొంది అపర్ణ. కానీ నిజాయితీగా వున్న తన భర్తను చూసి తన అభిప్రాయం తప్పనుకుంది.

"నన్ను క్షమించండి. పిల్లలు గొప్పగా ఉంటారని అడిగాను కానీ నా కోసం కాదండి" అంది అపర్ణ.

"ఆ విషయం పక్కన పెట్టండి. ముందు అన్నయ్యవాళ్లకు ఎలా సహాయం చేయాలో ఆలోచించండి" అంది అపర్ణ.

"అదే ఆలోచిస్తున్నాను.. మన దూరపు బంధువులలో వెంకటరావు అనే అతను ఏ.సి.బి.లో సీనియర్ ఆఫీసర్‌గా ఉంటున్నాడు. అతన్ని కలుస్తాను. అతనేమైనా సహాయం చేయగలడేమో చూద్దాం" అన్నాడు గంగాధర్.

తరువాత ఎలాగో ఇల్లు కనుక్కుని తన బంధువు వెంకటరావు ఇంటికి వెళ్లాడు గంగాధర్. ముందు కుశల ప్రశ్నలైన తరువాత అసలు విషయం మెల్లగా చెప్పాడు గంగాధర్.

"నేనొకసారి కేసు పూర్తిగా పరిశీలిస్తాను. నువ్వు చెప్పావు కాబట్టి ఏమైనా సహాయం చేయటానికి వీలవుతుందేమో చూద్దాం" అన్నాడు, వెంకటరావు.

అంతకన్నా ఎక్కువసేపు మాట్లాడితే బాగుండదు కాబట్టి అలాగేనని బయటకు వచ్చేసాడు గంగాధర్. కొన్ని రోజులు గడిచాయి. ఏ.సి.బి. వాళ్ల రిపోర్టును బట్టి శాఖాపరమైన విచారణ జరిపి ఆరు ఇంక్రిమెంట్లు లక్ష్మీపతి జీతంలోంచి తగ్గించారు. లక్ష్మీపతిని సెక్షన్ హెడ్ నుండి కింది స్థాయికి డిమోట్ చేశారు. కొన్ని సంవత్సరాలకి ఏ.సి.బి. కేసు నుంచి కూడా లక్ష్మీపతి విముక్తుడయ్యాడు.

ఒక ఆదివారం లక్ష్మీపతి కుటుంబాన్ని లంచ్‌కి పిలిచాడు గంగాధర్. లంచ్ చేసిన తరువాత గంగాధర్ చేతులు పట్టుకుని కృతజ్ఞతలు చెప్పాడు లక్ష్మీపతి.

"మనిద్దరం ఒకే ఊరి నించి వచ్చినా, నిన్ను చూసి మంచిగా ఉండటం నేర్చుకోలేకపోయాను. ఆశతో గొప్పగా బతకాలని తప్పులు చేసాను. నేను చేసిన తప్పులే నాకు శిక్ష విధించాయి. నీ మేలు నేను మర్చిపోలేను" అన్నాడు లక్ష్మీపతి.

"చాలా మంది ఇలాగే అవినీతికి పాల్పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. అవినీతి మార్గంలో వెళ్లేవాళ్లు ఎప్పటికైనా శిక్ష నుండి తప్పించుకోలేరు. మీ అదృష్టం బాగుండి మనకు సహాయం చేసే అధికారి దొరికాడు. లేకపోతే ఉద్యోగం కోల్పోవాల్సి వచ్చేది" అన్నాడు, గంగాధర్.

"లక్ష్మీపతీ! నీకు గుర్తుందో లేదో! మనం చిన్నప్పుడు మందులు కొనడానికి షాపుకు వెళ్లాం ఒకసారి. షాపువాడు చిల్లర తిరిగి ఇస్తూ పది రూపాయలు ఎక్కువ ఇచ్చాడు. నేను తిరిగి ఇచ్చేయమన్నా నువ్వు షాపువాడికి తిరిగి ఇవ్వలేదు. తరువాత కొన్ని రోజులకి నీ డబ్బులు పోయాయని చెప్పావు. అప్పుడే నేను "మనం అన్యాయంగా ఒక రూపాయి ఎక్కువ తీసుకున్నా దానికి రెండింతలు పోతాయి" అన్నాను. కానీ నువ్వు తేలికగా కొట్టిపారేసావు. గుర్తుందా?" అడిగాడు గంగాధర్.

"అవును.. నిజమే! నువ్వు చిన్నప్పటి నుండి నీతిగా వుండేవాడివి" అని గంగాధర్‌ని పొగిడాడు లక్ష్మీపతి.

టైం సాయంత్రం ఆరవటంతో లక్ష్మీపతి కుటుంబం వాళ్లింటికి వెళ్లారు.

అపర్ణ కళ్లల్లో తృప్తితో కూడిన వెలుగు. తన భర్తను ఇన్నాళ్లు తప్పుగా అర్థం చేసుకున్నాను" అనుకుంది అపర్ణ.

భార్య కళ్లల్లో భావాన్ని అర్థం చేసుకున్న గంగాధర్ హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు.

# మహాకవి పోతన

సంస్కృతంలో వేదవ్యాస మహర్షి ప్రణీతమై, ఆ మహర్షి తనయుడు శు మహర్షి పఠితమైన శ్రీ మహాభాగవతాన్ని తెలుగులో రచించిన భక్తాగ్రేసరుడు మహాకవి బమ్మెర పోతన. శైవ, వైష్ణవ భక్తి తత్వాలను ప్రసరింపచేసిన భక్తాగ్రేసరులు పాల్కుర్తి సోమన, బమ్మెర పోతనల పవిత్ర జన్మక్షేత్రాలుగా పాలకురితి, బమ్మెర రెండు గ్రామాలు తెలంగాణ మాగాణంలోని వరంగల్లు సమీపంలో వుండటం అద్భుత చారిత్రక విశేషం. క్రీ.శ.1400 ప్రాంతం వాడైన పోతన, అవతరించి ఆరు శతాబ్దాలయినా నేటికీ తెలుగు సాహిత్యంలో సహజ పాండితీ కవివరేణ్యుడైన పోతన పద్య మాధుర్యం, తెలుగు ప్రజ నోట విలసిల్లుతోంది. సంస్కృతంలో గ్రంథం అంటే ముప్పై రెండు అక్షరాల పరిమితిగల శ్లోకం. సంస్కృత భాగవతం గ్రంథ సంఖ్య కంటే తెలుగు భాగవతం ముప్పై వేల గ్రంథ సంఖ్య వరకు పెరిగి పెంపు చెందింది. ఆంధ్రం, తెలుగు ఒకదానికొకటి పర్యాయ పదాలు. తెలుగు అనే పదం కేవలం భాషాపరంగాను, ఆంధ్రం అనే పదం దేశ పరంగాను వాడుకలో వుండేవి. పోతన మహా భాగవతం, పండితులు, పామరులు, బాలురు, వృద్ధులు, స్త్రీ పురుషులు సమస్త ఆంధ్ర జన హృదయాలను ఆకట్టుకొంది. పల్లెల్లో, పట్టణాలలో ప్రస్తుత 21వ శతాబ్దంలోనూ కంఠస్థమైన పద్యాలు, తెలుగు పద్య మాధుర్యం వెల్లివిరుస్తోంది. భక్తి తత్వ కవిగా పోతన వీరభద్ర విజయం, నారాయణ శతకం, భోగినీ దండకం, శ్రీ భాగవతం ఎనిమిది స్కంధాలు మొదలయిన కృతులు రచించారు.

"పలికెడిది భాగవతమట
పలికించు విభుండు రామభద్రుండట నే
పలికిన భవహర మగునట
పలికెద వేరొండు గాథ పలుకగ నేలా"

"చేతులారంగ శివపూజ సేయడేని
నోరు నొవ్వంగ హరికీర్తి నుడువడేని
దయయు సత్యంబు లోనుగా దలపడేని
కలుగనేటికి తల్లుల కడుపు చేటు"

అంటూ తెలుగు సాహిత్యంలో జానుతెనుగు శైలిలో, దేశ కాల మత పరిస్థితులలో పోతన, శివ, వైష్ణవ భక్తి సామరస్యం సాధించే అద్వైత భక్తి తత్త్వంతో తాను శైవుడయినా భాగవతాన్ని శ్రీరామునికి అంకితం చేసారు.

పోతన వ్యవసాయ వృత్తిచే జీవించినట్టు ఆయనే స్వయంగా చెప్పుకొన్నారు. పరమ భక్తాగ్రేసరుడయిన పోతన స్వగ్రామం బమ్మెరలోనే ప్రశాంతంగా జీవించినట్టు తెలుస్తోంది. పోతన సమకాలికుడైన శ్రీనాథ మహాకవి తన గ్రంథాలను మంత్రులు, సామంతులు, రాజులకు అంకితం యిచ్చి కవి సార్వభౌమునిగా




నాటి కవితా సామ్రాజ్యాన్ని ఏలుతున్న రోజులలో పోతన గృహస్థ ధర్మ నిర్వహణకు ఎంత సరిపోతుందో అంత మాత్రమే సంపాదించటం కోసం పొలం దున్నుతూ, వ్యవసాయమే వృత్తిగా కాలక్షేపం చేసేవాడు. శ్రీనాథుడు పోతనను ఉద్దేశించి కందంలో-

"కమ్మని గ్రంథం బొక్కటి
యిమ్ముగనే నృపతికైన గృతి యిచ్చిన గో
కొమ్మని యీయరె యర్థం
బిమ్మహి దున్నంగ నేల యిట్టి
మహాత్ములో" అన్నప్పుడు.. వెంటనే పోతన ఉత్పలమాలలో, శ్రీనాథునికి సూటిగా యిచ్చిన ప్రత్యుత్తరం ఆ మహాకవి జీవన చిత్త ప్రవృత్తి తెలియచేస్తోంది.

"బాల రసాల సాల నవ పల్లవ కోమల
కావ్య కన్యకన్
గూళలకిచ్చి యప్పడుపు కూడు భుజించుట
కన్న సత్కవుల్
హాళికులైన నేమి? గహనాంతర సీమల
కందమూల కౌ
ద్దాళికులైన నేమి? నిజదార సుతోదర
పోషణార్థమై"

ప్రకృతిసిద్ధమైన సౌకుమార్య మాధుర్య సౌందర్యంగల బాల రసాలం వంటి కావ్య కన్యకను కూళలగు వారికి యివ్వటం పడుపుకూడు ఆశించుట వంటిదే. వ్యవసాయంలోని కందమూలాలే తనకు, భార్యాపుత్రులకు చాలునని, కావ్య కన్యకను పరమేశ్వరార్పితం చేసినట్లయితే భుక్తియే కాక ముక్తిని పొందవచ్చని హాళిక సత్కవి పోతన ప్రత్యుత్తరం, ప్రస్తుత 21వ శతాబ్ద సామాజిక జీవనంలోని మనం, ఆ మహాకవి వ్యక్తిత్వ మహోన్నతకు శిరస్సు వంచి ప్రణతులు సమర్పించవలసిందే.

మరొక పద్యం "కాటుక కంటినీరు" పోతన తల్లితో కుమారుడు మాట్లాడినట్లుగా "నిను నా కటికిం గొనిపోయి యల్ల కర్ణాట కిరాట
కీచకులకు అమ్మను. త్రిశుద్ధిగా తనను నమ్మమని" భారతీ! అంటూ అనునయించటం, నర స్తుతి విముఖత్వానికి నిదర్శనం.

కావ్య విమర్శనాత్మక కవి జీవిత రచనం అనే సూత్రం ప్రకారం ప్రముఖ విద్వత్కవి నిడుదవోలు వేంకటరావు గారు పోతన జీవితం, భక్తి మహత్వ్యం. మహాభాగవత రచన గురించిన పరిశోధనాత్మక గ్రంథం ప్రచురింపచేసారు. ఎన్నో వ్యాసాలు, గ్రంథాలు గత శతాబ్దాలలో ఎందరో కవులు వెలుగులోకి తెచ్చారు. ఎన్నో కల్పిత కథలు, వివాదాస్పద విషయాలు, నిరాధార చారిత్రక అంశాలు గ్రంథస్థమయ్యాయి. శ్రీనాథ, పోతనలకు సంబంధించిన సమకాలిక జీవన సంఘటనలు వారి చిత్త ప్రవృత్తులు వ్యక్తం చేసాయి.

కానీ వారి రచనల ఆధారంగా, జీవిత చరిత్రలు కళ్లకు కట్టినట్టు వాస్తవ గాథలుగా తెలుగు ప్రజల ఆదరాభిమానాలు నోచుకొంటున్నాయి. 9005 గద్య పద్యములు వున్న పోతన భాగవతంలో 1060 గద్య పద్యాలు పోతన ప్రియ శిష్యులు గంగ, సింగన, నారయ రచించినట్లు స్పష్టమౌతోంది.

తెలుగు సాహిత్యంలో నన్నయ యుగానికి వెనుక క్రీ.శ.1100 ప్రాంతంలో శివకవి యుగం, తరువాత తిక్కన యుగం ఆరంభమైంది. తెలుగు భాషలో తనకు ముందు వెలసిన కవిత్రయ విరచితమైన భారతాన్ని ఎఱ్ఱన, నాచన సోమన, భాస్కర రామాయణాది రచనల కాలంలో, పోతన నాటి ప్రాచీన కవులను మించిన లోకోత్తరమైన భాగవత మహామృతం భారతదేశంలోని దేశ భాషలలో తెలుగు భాషకు, నభూతో నభవిష్యతిగా చిరుతన యశశ్చంద్రికలు ప్రసరింపచేసింది. నాదబ్రహ్మ త్యాగరాజు ప్రతి దిన పారాయణం చేసిన తెలుగు భాగవత దివ్యత్వం తాళపత్ర రూపంలో తిరువయ్యారులో భద్రపరచబడినట్లు తెలుస్తోంది.

**- జయసూర్య**

**గర్భగుడిలోని మూలవిరాట్టు దీపపు కాంతిలో వెలిగిపోతున్నాడు. బయట ఎర్రటి ఎండ ఒంటిపై పడుతున్నా రామక్క శరీరం మాత్రం ఎందుకో మసక బారిపోతోంది. మాసిన బట్టలు, నెరిసిన జుట్టు, నెత్తిపై ఒక ఎర్రటి టవలు కప్పుకుని చేతిలో ఓ పాత సంచినిండా గుడ్డలు పెట్టుకుని జాగ్రత్తగా దాన్ని భుజానికి తగిలించుకుని కూర్చుంది.**

# కేరాఫ్ గుడి మెట్లు

సింగంపల్లి శేష సాయి కుమార్



స్వామికి మధ్యాహ్నం నైవేద్యానికి చల్లటి దద్ధ్యోజనాన్ని సిద్ధంగా ఉంచారు. అది కాస్త రామక్క చేతిలోకి చేరుతుంది. ఊరిలోని జనాలు అందరూ దేవుణ్ణి చూడటానికి తండోప తండాలుగా వస్తుంటారు. కానీ రామక్క మాత్రం తనకు సాయం చేస్తారేమో అని అందరిలో దేవుణ్ణి చూస్తుంటుంది. ఇంతవరకు ఒక్కసారి కూడా లోపలికి వెళ్లి స్వామిని చూడలేదు.

ఓ రోజు ఒక బడా ఆసామి ఒకరు గుడి మెట్లు ఎక్కుతూ "ఎందుకు ఇక్కడ ఇంత మంది బిచ్చగాళ్లను ఉంచారు, దూరంగా పంపేయండి" అంటూ అరుపులు, కేకలు పెడుతూ లోపలికి వచ్చాడు. వెనకనే వస్తున్న ఆయన బిడ్డ మాత్రం ఓ పది రూపాయలు రామక్క చేతిలో పెట్టి వచ్చాడు.

"ఎందుకురా వాళ్లకు డబ్బులిచ్చావు? వాళ్లకు నెల నెలా పింఛను వస్తుంది తెలుసా? అవి చాలదన్నట్టు మళ్లీ ఇక్కడికొచ్చి మనల్ని అడుగుతారు" అంటూ ఏదో చెప్పబోయాడు.

"నాన్నా, ఆ డబ్బు వాళ్లకు ఎక్కడికొస్తుంది? కట్టుకోడానికి బట్టలు కూడా సరిగ్గా లేవు. అలాంటిది వాళ్లు ఎలా మోసం చేస్తారు? మనం చూడు.. ఎండకు గుడికొచ్చి నీడకోసం పాకులాడుతున్నాం. కానీ వాళ్లకు ఎన్ని బాధలు, కష్టాలు ఉంటే వాటిని దిగమింగడానికి ఎర్రటి ఎండల్లో అలా మెట్లపై కూర్చుంటారు.. చెప్పండి" అంటూ శాంతపరిచే ప్రయత్నం చేసారు.

రామక్కకు బిడ్డలు లేరు. మొగుడు పెళ్లయిన ఏడేళ్లకే మొగుడు పోయాడు. ఉన్నప్పుడు ఆయనతో పాటు కూలిపనులకు పోతూ కాలం వెళ్లదీసేది. కానీ వయస్సు మీద పడేసరికి పని చేసే సామర్థ్యం తగ్గిపోయింది. వచ్చే పింఛను కాస్తా ఇంటి కిరాయి, మందులకు సరిపోదు. ఇక చేసేది లేక, చేయడం ఇష్టం లేకపోయినా యాచిస్తూ జీవిస్తోంది.

ప్రభుత్వం మారిందని ఎవరో చెప్పారు. ఇంకా గూడు లేనోళ్లు ఊళ్లో చాలా మంది ఉన్నారని తెలిసి సర్వే చేద్దామని వచ్చారు. చాలా యిది సారోళ్లు, గుడిసెలన్నీ తిరుగుతూ అందరి వివరాలు రాబట్టారు.

ఇంతలో బయటి నుంచి వచ్చింది రామక్క.

అది చూసిన ఆఫీసరొకరు "నీ పేరు ఏం పెద్దామే" అన్నాడు గట్టిగా.

తనని కూడా పేరడిగేవారు ఉన్నారా అని ఆశగా 'రామక్క సారు' అంది.

"నీతో పాటు ఎవరెవరుంటారు?" అన్నాడు అయిన అనుమానంగా.

"నేనొక్కదాన్నే. నాకెవురు లేరు, పిల్లాపీచు కూడా లేరు" అంది ఆయన అనుమానం తీరేటట్లు.

"నీకు ఇల్లు పెట్టమంటావా, గవర్నమెంటుది" అన్నాడు ఆ పెద్ద సారు.

"అయ్యా పెట్టండి సారు, నాకు గూడు లేదు. అదిస్తే కాస్త అందులో కలో గంజో తాగుతా. ఇక్కడ ఈ ఇల్లు వానొస్తే కారుతుంది. అయినా కిరాయి కట్టాల్సిందే" అంటూ రెండు చేతులు జోడించి అడుగుతోంది రామక్క.

"నీ అడ్రసు చెప్పు" అన్నాడు సారు.

"నాకు తెలియదు సారు, చెప్పడం రాదు.. ఇదర ఈ ఆధార్ కార్డులో ఉంది రాసుకో" అంది రామక్క.

సగం నలిగిపోయిన కార్డుముక్కను జాగ్రత్తగా సిత్తిలో నుంచి తీసి చేతికందించింది. దాని మడత విప్పి చూసిన ఆఫీసరు "ఇదేంది కేరాఫ్ గుడి మెట్లు" అని ఉంది అన్నాడు.

"అయ్యా, నాకు ఇల్లు లేదు. అందరు గుడికాడ రామక్క అంటారు. అందుకే అలాగే రాసారేమో" అంది అమాయకంగా.

ఎలాగైనా సాయం చేయాలనుకున్నాడు ఆఫీసరు. దర్శనానికి రాకున్నా అనుగ్రహించాడు గుడిలోని దేవుడు. రామక్క అప్లికేషనుకు ఇల్లు మంజూరైంది. మంజూరు పత్రం గుడి మెట్లపై మెల్లగా వచ్చి వాలింది.

రామక్క అదేదందో అర్థం కాక చదువొచ్చిన దేవుని కోసం వెతుకులాట మొదలుపెట్టింది. ❑

# మునక్కాయలతో వెరైటీలు

## మునక్కాయ ఉల్లికారం

**కావలసిన పదార్థాలు**

మునక్కాయ ముక్కలు: పదిహేను; ఎండుమిర్చి: నాలుగు; దనియాలు:



ఒకటిన్నర టేబుల్‌స్పూను; మెంతులు: పావు చెంచా; మినప్పప్పు: అర చెంచా; మిరియాలు: పావు చెంచా; జీలకర్ర: చెంచా; చింతపండు గుజ్జు: ఒక చెంచా; కొబ్బరి తురుము: అరకప్పు; ఉల్లిపాయ: ఒకటి పెద్దది; పసుపు: అర చెంచా; నూనె: టేబులు స్పూను; ఆవాలు: అర చెంచా; ఉప్పు: తగినంత; కరివేపాకు రెబ్బలు: రెండు; కొత్తిమీర: తగినంత.

**తయారు చేసే విధానం:**

ముందుగా మునక్కాయ ముక్కల్ని పసుపునీళ్లల్లో ఉడికించుకుని తీసుకోవాలి. స్టౌ మీద కడాయి పెట్టి ఎండుమిర్చి, దనియాలు, మెంతులు, మినప్పప్పు, మిరియాలు, కొంచెం జీలకర్ర వేసి నూనె లేకుండా వేయించి తీసుకోవాలి. ఈ దినుసులు కొబ్బరి తురుము, చింతపండు గుజ్జు, ఉల్లపాయ ముక్కలు, మిక్సీలో వేసి మెత్తగా చేసుకుని పెట్టుకోవాలి. బాణలిని స్టౌ మీద పెట్టి నూనె వేసి ఆవాలు, జీలకర్ర, కరివేపాకు, వేయించి చేసి పెట్టుకున్న మసాలా వేయాలి. అది వేగుతున్నప్పుడు కాసిన్ని నీళ్ళ, మునక్కాయ ముక్కలు వేసి బాగా కలపాలి. కూర ఉడుకుతున్నప్పుడు తగినంత ఉప్పు, కొత్తిమీర తరుగు వేసి ఓసారి కలిపి అయిదు నిమిషాల తరువాత దింపాలి.

## కొబ్బరి పాలతో..

**కావలసిన పదార్థాలు**

మునక్కాయలు: మూడు; ఉల్లిపాయ: ఒకటి; టమాట: ఒకటి; పచ్చిమిర్చి: ఒకటి; కరివేపాకు: రెండు రెబ్బలు; కొబ్బరిపాలు: ఒక కప్పు; ఎండుమిర్చి: ఒకటి; ఆవాలు: ఒక చెంచా; పసుపు: పావు చెంచా; కారం: చెంచా; దనియాల పొడి: చెంచా; ఉప్పు: తగినంత; నూనె: కొద్దిగా.

**తయారు చేసే విధానం**

మునక్కాయల్ని ముక్కల్లా కోసి పెట్టుకోవాలి. స్టౌ మీద కడాయి పెట్టి నూనె వేయాలి. నూనె వేడెక్కాక ఆవాలు, ఎండుమిర్చి, కరివేపాకు వేయించి తరువాత ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి తరుగు, పసుపు వేయాలి. ఉల్లిపాయ ముక్కలు వేగాక టమాటముక్కలు, కారం, దనియాల పొడి వేసి కలపాలి. టమాటముక్కలు ఉడికిన తరువాత మునక్కాయ ముక్కలు, కప్పునీళ్ల, తగినంత ఉప్పు వేసి మూత పెట్టాలి. మునక్కాయ ముక్కలు మెత్తగా అయ్యాక



కొబ్బరిపాలు వేసి బాగా కలిపి కూర దగ్గరకు అవుతున్నప్పుడు దింపేయాలి.

## మసాలా కర్రీ

**కావలసిన పదార్థాలు**

మునక్కాయలు: ఐదు; కారం: రెండు టేబుల్ స్పూన్లు; వేయించిన పల్లీల పొడి: నాలుగు టేబుల్ స్పూన్లు; దనియాల పొడి: రెండు టేబుల్‌స్పూన్లు; కొత్తిమీర తరుగు: పావుకప్పు; ఇంగువ: పావుచెంచా, టమాటలు: రెండు; పచ్చిమిర్చిపేస్టు: చెంచా: వెల్లుల్లి పేస్టు: రెండు చెంచాలు; అల్లం పేస్టు: చెంచా; నిమ్మరసం: రెండు చెంచాలు; గరంమసాలా: చెంచా; ఉప్పు: తగినంత; నువ్వుల పొడి: మూడు స్పూన్లు; నూనె: పావుకప్పు; జీలకర్రపొడి: టేబుల్‌స్పూను; జీలకర్ర: అర చెంచా; సెనగపిండి: రెండు టేబుల్‌స్పూన్లు, బెల్లం తరుగు: టేబుల్ స్పూన్లు; పసుపు: అర చెంచా.

**తయారు చేసే విధానం**

స్టౌ మీద కడాయి పెట్టి చెంచా నూనె



వేయాలి. అది వేడెక్కాక సెనగపిండి వేసి రెండు మూడు నిమిషాలు వేయించుకుని ఓ గిన్నెలోకి తీసుకోవాలి. ఈ పిండిలో కారం, పల్లీల పొడి, దనియాల పొడి, కొత్తిమీర తరుగు, వెల్లుల్లిపేస్టు, నిమ్మరసం, గరంమసాలా, సరిపడా ఉప్పు, నువ్వుల పొడి, జీలకర్రపొడి, బెల్లంతరుగు వేసుకుని అన్నింటినీ కలుపుకోవాలి. ఇప్పుడు ఓ గిన్నెలో మూడు కప్పుల నీళ్ల తీసుకుని స్టౌ మీద పెట్టాలి. అవి మరుగుతున్నప్పుడు పసుపు, తగినంత ఉప్పు, మునక్కాయ ముక్కల్ని వేసి మూత పెట్టాలి. ఆ ముక్కలు ఉడికాక దింపేసి, నీటిని విడిగా తీసుకోవాలి. స్టౌ మీద కడాయి పెట్టి మిగిలిన నూనె వేసి జీలకర్ర, అల్లంపేస్టు, పచ్చిమిర్చిపేస్టు, ఇంగువ, టొమాటో ముక్కలు వేసి అన్నింటినీ వేయించాలి. టమాట ముక్కలు ఉడుకు తున్నప్పుడు చేసి పెట్టుకున్న సెనగపిండి మిశ్రమాన్ని వేసి బాగా కలపాలి. రెండు నిమిషాలయ్యాక మునక్కాయ ముక్కలు, అవి ఉడికించిన నీటిని కూడా పోసి మూత పెట్టి కూర దగ్గరకు అవుతున్నప్పుడు దింపాలి. ❏



**వాస్తువార్త**

వాస్తు విద్వాన్ సాయిశ్రీ

డా॥ దంతూరి పండరినాథ్

3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్

సెల్స్: 9885446501/9885449458




# బావి తవ్వటానికి ఏ ప్రదేశాలు శ్రేయస్కరం?

**బావి** తవ్వటానికి ఉత్తర ఈశాన్యపు చోటునుగానీ, తూర్పు ఈశాన్యపు చోటును నిర్ణయించుకోవాలి. ఇంటి ఈశాన్య మూల నుండి ప్రహరీగోడ ఈశాన్య మూలకు ఒక తాడు కొంచెం గట్టిగా లాగితే ప్రహరీ గోడ ఈశాన్య మూల రెండు ఈశాన్య మూలలుగా విభజింపబడుతుంది. ఒకవైపు ఉత్తర ఈశాన్యం, మరోవైపు తూర్పు ఈశాన్యం. ఎక్కువ స్థలం ఎటు వైపు వుంటే అటువైపు అనుకూలంగా బావి తవ్వుకోవచ్చు. తాడు చూపిస్తున్న డైరెక్షన్ మధ్యలో బావి తవ్వకూడదు.



భవిష్యత్తులో ఇంటిమార్పులను కూడా దృష్టిలో ఉంచుకుని బావి తవ్వే స్థలాన్ని నిర్ధారణ చేసుకుంటే మంచిది.

బావి భూమి లోపలికి గుండ్రంగా వరలు దింపవచ్చు. బావి పైన గట్టు చతురస్రంగా కాక గుండ్రంగానే నిర్మించాలి. బావి పైభాగం చతురస్రంగా నిర్మిస్తే ఏదో ఒక కోణం ఇంటికి పోటును కలిగిస్తుంది. అందువల్ల ఇక్కట్లు ఎదుర్కోవలసి వస్తుంది. బావిచుట్టూ నిర్మించే ప్లాట్‌ఫారం ప్రహరీ తూర్పు, ఉత్తర గోడలను తాకకుండా కొంత స్థలాన్ని వదిలేసి కట్టాలి. బావి ప్లాట్‌ఫారమ్ ఇంటి నేల లెవెలు కన్నా తక్కువ లెవెలులో ఉండాలి.

ప్లాట్‌ఫారమ్ నుండి నీరు ఈశాన్యం వైపు ప్రవహించి బయటకు వెళ్లేలా పల్లాన్ని ఏర్పాటు చేయాలి. లేదా ఈశాన్యంలో ఉన్న అవుట్‌లెట్ ద్వారా భూమిలోపల ఏర్పాటు చేసిన పైపులో పడి అటు నుండి అంతర్గతంగా వెళ్లే ఏర్పాటు చేయాలి.

బోరింగ్‌కు కూడా ఇదే పద్ధతి వర్తిస్తుంది. కొంత మంది ఇంటికి ఈశాన్య మూల అని బావినిగానీ, బోరింగునుగానీ ఇంటి ఈశాన్య మూలకు ఆనుకొని నిర్మిస్తారు. ఇది సరైన పద్ధతి కాదు. బోరుగానీ, బావినిగానీ ఇంటికి ఈశాన్య మూలలో కాక పూర్తి ఇంటి స్థలానికి ఈశాన్యంలో బయట రావాలి, ఇంటి కప్పుకింద బావి తవ్వకూడదు.

ఫలితాలు

- తూర్పు ఈశాన్య స్థలంలో బావి వుంటే యజమానికి పేరు ప్రతిష్ఠలతో పాటు సకల సంపదలు కలుగుతాయి.
- ఉత్తర ఈశాన్యంలో బావి వుంటే అది యజమాని పేరు ప్రతిష్ఠలకు పూచీపడదు, కానీ ఐశ్వర్య వృద్ధిని, సంతాన వృద్ధిని, కుటుంబ సౌఖ్యాన్ని కలిగిస్తుంది.
- తూర్పు ఈశాన్యంలో కాక తూర్పున మధ్య నుండి ఈశాన్యం వైపు స్థలంలో బావి వుంటే యజమానికి, కుటుంబానికి ఎన్నో శుభాలు చేకూరుతాయి.
- ఉత్తర ఈశాన్యంలో కాక మధ్య ఉత్తరం నుండి ఈశాన్యపు మూలకు దగ్గర స్థలంలో బావి ఎక్కడున్నా యజమానికి, కుటుంబానికి కూడా మంగళప్రదమవుతుంది.

బావులు తవ్వకూడని ప్రదేశాలు

బావులు తవ్వకూడని స్థలాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ బావులు తవ్వకూడదు. ఉత్తర వాయువ్య స్థలంలో బావి తవ్వించినా, లేక గోతులు వున్నా శత్రువుల బాధలు కలుగుతాయి. స్త్రీలకు మానసిక సుఖశాంతులు కరువవుతాయి. వాటి ప్రభావం యజమాని మీద పడి దుష్ఫలితాలు కలుగుతాయి.

దక్షిణ నైరుతి భాగంలో బావిగానీ, గొయ్యిగానీ వుంటే ఆర్థిక నష్టాలు, రుణభారం కలుగుతాయి. ఆ ఇంట్లో ఉంటే స్త్రీలకు ఆరోగ్య సమస్యలుంటాయి. దక్షిణ ఆగ్నేయంలో బావులు, గోతులు వుంటే యజమాని చెడు అలవాట్లకు లోనవుతారు. ధన నష్టం, అగ్నిభయం, అనారోగ్యం కలుగుతాయి.

తూర్పు ఆగ్నేయంలో బావిగానీ, గొయ్యిగానీ వుంటే సంతానానికి, యజమానికి ఆరోగ్యం చెడిపోవడం, దొంగల భయం, అగ్నిభయం మొదలయిన నష్టాలు కలుగుతాయి.

పశ్చిమ నైరుతిలో బావిగానీ, గొయ్యిగానీ వుంటే పురుషులు చెడు ప్రవర్తనకు లోనవటమే గాక, వ్యాధుల బారిన పడతారు.

దక్షిణాన బావి తవ్వటం వల్ల స్త్రీలకు సమస్యలు వస్తాయి. పశ్చిమ భాగంలో బావి తవ్వితే పురుషులకు అనారోగ్యం, అష్టకష్టాలు వస్తాయి.

కనుక బావి తవ్వాలనుకున్నప్పుడు ఎవరో చెబితే విన్నదిగానీ, పుస్తకాల్లో చదివిన విషయాలు గానీ దృష్టిలో పెట్టుకొని స్వంత నిర్ణయాలు తీసుకోకుండా 'వాస్తు' గురించి బాగా తెలిసిన వారిని సంప్రదించి వారి సలహా మేరకు స్థల నిర్ణయం చేసుకోవటం శ్రేయస్కరం. ❑

# మతిమరుపు దేవత

జ్ఞాపకశక్తి అనేది మనిషికి లభించిన ఓ మహత్తరమైన కానుక. మనుషులకున్నట్టు మరే ప్రాణికీ అంతటి శక్తి లేదు. అందు లోనూ ప్రత్యేకించి పురుషులకన్నా స్త్రీలకు జ్ఞాపకశక్తి అధికం. అయితే వృద్ధాప్యంలోకి అడుగు పెట్టేసరికి చాలా మందిలో జ్ఞాపక శక్తి తగ్గిపోతుంది. కొందరిలో అయితే అది మరీ ఎక్కువ శాతంలో ఉంటుంది.

వృద్ధాప్యంలో కొందరు తమ పిల్లలను, భార్యను గుర్తు పట్టలేని స్థితిలో ఉంటారు. భౌతికంగా ఉంటారు తప్ప జ్ఞాపకశక్తి అనేది ఉండదు. ఎవరైనా ఒకటికి పది సార్లు చెప్తే తప్ప ఏదీ గుర్తుకు రాదు.

జ్ఞాపకశక్తి తగ్గిపోకుండా ఉండటానికి తరచూ నలుగురితో మాట్లాడుతుండటం ముఖ్యం. మనసు విప్పి మాట్లాడాలని మానసిక శాస్త్రజ్ఞులు చెప్తున్నారు.

ముఖ్యంగా వయోవృద్ధుల విషయానికొస్తే వారి మాట వినేవారు లేకుంటే క్రమంగా వారిలో జ్ఞాపకశక్తి తగ్గిపోతూ చివరికి ఏదీ గుర్తు లేకుండా పోతుందట.

మరోవైపు జ్ఞాపకశక్తి లేకుండా మతిమరుపుతో సహజీవనం చేస్తున్నవాళ్ల విషయం ఒకింత అదృష్టం. ఒకింత దురదృష్టం. గతంలోని బాధలు వంటివి గుర్తుండక వర్తమానంలో ఏదీ జరగనట్టు బతికేస్తుంటారు. అది ఒక విధంగా వరమే. కానీ కొన్నిసార్లు అది శాపం కూడానూ.

నిత్య జీవితంలో చాలా మందికి మతిమరుపు అనేది ఓ పెద్ద సమస్యే. సెల్‌ఫోన్ మొదలుకొని ఇంటి తాళంచెవి వరకూ ఎక్కడ పెట్టేస్తారో గుర్తుకు రాక అవస్థ పడుతుంటారు వాటిని వెతుకుతూ. ఇంకొందరైతే మాట్లాడుతూ మాట్లాడుతూనే 'అవునుగానీ ఇప్పుడేమన్నాను?' అని ప్రశ్నించేవారుంటారు. వారి పరిస్థితి మరీ దయనీయం. అటువంటి వారిచ్చే మాట మీద బతకరు. ఇచ్చిన మాటను మరుక్షణం మరిచిపోతారు. ఇందువల్ల ఎదుటి వారికి చాలా కష్టం.

మతిమరుపు అనేది సాలెగూడులా మెల్ల మెల్లగా పెరిగిపోయి ఓ దశలో తామెందుకు ఉన్నాం అన్న స్థాయికి దిగిపోతారు. ఏదీ గుర్తుండక నానా అవస్థా పడతారు. సాయం చేసిన వారిని మరచిపోతారు. త్యాగధనులను మరచిపోతారు. ఈ రోజుల్లో ఇది చాలా మందిలో ఉన్న దురవస్థ. మరచిపోయిన విషయాలను గుర్తుకు తెచ్చుకోవడానికి చరిత్ర పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయి. కానీ చదివేవారు ఎవరు?

మతిమరుపు ఎందుకు వస్తుందనేదానికి సంబంధించి కూడా అనేక పరిశోధనలు జరిగాయి, జరుగుతున్నాయి. మానసిక ఒత్తిడి, దిగులు, కోపం, మరీ అతిగా స్పందించడం వంటివి మతిమరుపుకు కొన్ని కారణాలు. కంటి అద్దాలను పెట్టుకునే 'కళ్ళజోడు ఎక్కడ మరచిపోయానబ్బా..' అని అడిగేవారు, వెతుక్కునేవారిని మనం చూస్తూనే ఉంటాం. పోతన భాగవతాన్ని, వాల్మీకి రామాయణాన్ని కొందరు పుస్తకం లేకుండా చెప్పేవారిని చూస్తుంటే ఆశ్చర్యం వేస్తుంది. అంతెందుకు.. బుల్లితెరపై చిన్న పిల్లలు పెద్ద పెద్ద పాటలను సైతం తమ ముందు పుస్తకం పెట్టుకోకుండా పాడటం చూస్తుంటే నాకు ఔరా అనిపిస్తుంది. ఎందుకంటే నాకు ఇష్టమైన పాటలనేకం. కానీ అవేవీ గుర్తుండవు. వింటున్నప్పుడు 'ఎంత మంచి పాట కదూ!' అని అనుకుంటాను.

యూదులు మతిమరుపుకు ఒక దేవత ఉందని నమ్ముతారు. ఆ దేవత ఒకరి ముక్కు మీద ముద్దిస్తే అతనికున్న జ్ఞాపక శక్తి పోతుందని అంటుంటారు. ఈ దేవత మతిమరుపును పుట్టించి మంచిదే చేస్తుందనుకునేవారు వున్నారు. ఇందుకు ఉదాహరణగా ఓ కథ ఉంది.

హత్యోదంతంలో ఓ యూద వర్తకుడిని ప్రభుత్వం అదుపులోకి తీసుకుంటుంది. నిజానికి తను అమాయకుడు, నిరపరాధి. ఎవరో చేసిన హత్యకు అతనిని అరెస్టు చేసి ఉరిశిక్ష విధిస్తూ ప్రభుత్వం ఓ ప్రకటన చేసింది. ఉరిశిక్షను అమలు చేసే ముందు రోజు వర్తకుడి కుటుంబం అతనిని చూడటానికి వస్తారు. యూద వర్తకుడు కన్నీరు మున్నీరవుతూ తనను కాపాడమని వేడుకుంటాడు. కుటుంబ సభ్యులకు ఏం చేయాలో తెలీదు. వారు వెంటనే మతిమరుపు దేవతను ప్రార్థిస్తారు. "ఓ మతిమరుపు దేవతా! నువ్వు మాత్రమే ఆయనను కాపాడగలవు" అని వేడుకుంటారు.

మరుసటి రోజు ఉదయం వర్తకుడిని ఉరికంబం దగ్గరకు తీసుకువస్తారు. అతనిని ఉరి తీసే ముందుర ఎందుకు ఉరి తీస్తున్నామనే పత్రాన్ని అతని సమక్షంలో చదివి వినిపించడం ఓ ఆనవాయితీ. అయితే ఆ రోజు ఆ ఉత్తర్వు కనిపించలేదు. జైలు అధికారి దానినెక్కడో మరచిపోయి ఉంచుతాడు. అది ఎక్కడ ఉంచాడన్నది అతనికి గుర్తుకు రాదు. ఎంత వెతికినా కనిపించదు. జైలు సిబ్బంది కూడా వెతుకుతారు. వారికి అదీ దొరకదు. వెంటనే ప్రధాన న్యాయమూర్తికి ఆ కేసు వివరాలు చెప్పి కొత్తగా ఓ ఉత్తర్వు ప్రతిని తీసుకురమ్మని జైలు అధికారం తన సిబ్బందిని పంపుతారు.

ఇద్దరు జైలుసిబ్బంది న్యాయమూర్తి వద్దకు వెళ్తారు. ఆయనకు కేసు వ్యవహారమంతా చెప్తారు. కానీ ఆ న్యాయమూర్తికి ఏదీ గుర్తుకు రాదు. అన్నీ మరచిపోతారు. ఆయన న్యాయస్థానంలోని ఓ రిజిస్ట్రారుని కలిసి విషయం చెప్పమంటాడు.

వెంటనే ఇద్దరు జైలుసిబ్బంది న్యాయస్థానం రిజిస్ట్రారు దగ్గరకు వెళ్తారు. తీరా ఆయన కూడా కేసేమిటి అని ఎదురు ప్రశ్న వేస్తారు. ఏం తీర్పు చెప్పారని ఎదురు ప్రశ్న వేస్తారు. తనకేదీ గుర్తుకు రావడం లేదంటాడు. చివరకు ప్రభుత్వం న్యాయస్థానం నుంచి ఉత్తర్వులు లేనిదే తాము ఉరిశిక్ష అమలు చేయలేమని ఓ నిర్ణయానికి వచ్చి ఆ యూద వర్తకుడిని విడిచిపెడుతుంది.

వర్తకుడు ఇంటికి చేరుకోవడంతోనే కుటుంబ సభ్యుల ఆనందానికి అంతులేదు. అప్పుడు తాము మతిమరుపు దేవతను వేడుకున్న విషయాన్ని చెప్తారు. ఆ మతిమరుపు దేవతే నన్ను కాపాడిందంటారు.

మతిమరుపు దేవతకు కృతజ్ఞతలు చెప్పడంతో కథ ముగుస్తుంది.

ఇలా మతిమరుపు వల్ల జరిగే కొన్ని మంచి విషయాలు లేకపోలేదు. మనల్ని ప్రేమించే వారిని, మనం సాయం చేసిన వారిని, మన ఉన్నతికి దోహదపడ్డవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ మరచిపోకూడదు. అది మంచిది కాదు. అలాగే దేశం కోసం త్యాగం చేసినవారి జీవిత చరిత్రలను మరచిపోకూడదు. వారిలోని మంచిని తెలుసుకుని వాటిని వీలైనంత మేరకు ఆచరణలో పెట్టడం కనీసం కర్తవ్యం.

**- యామిజాల జగదీశ్**



# వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

## మేషం



మొండి బకాయిలు వసూలవుతాయి. క్రీడాకారులకు ప్రోత్సాహం లభిస్తుంది. ఎదురు చూస్తున్న వర్తమానం ఆలస్యమయ్యే సూచనలున్నాయి. చిరు వ్యాపారులకు పోటీ ఏర్పడుతుంది. ఉద్యోగ ప్రయత్నం ఫలించే సూచనలున్నాయి. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆకస్మిక ప్రయాణం చేస్తారు.

## వృషభం



శుభ కార్యాల్లో పాల్గొంటారు. అనుకోని సంఘటనలు జరిగినా మనోధైర్యంతో ఎదుర్కొంటారు. శత్రువులు మిత్రులవుతారు. హోల్ సేల్ వ్యాపారులకు బాగుంటుంది. ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు. ప్రతికూలతలు ఎదురైనా ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. స్త్రీలు స్థిరాస్తులు కొనుగోలు చేస్తారు. పోటీ పరీక్షల్లో విజయం.

## మిథునం



సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. స్త్రీలకు ఆరోగ్య సమస్యలుంటాయి. కళాకారులకు ప్రోత్సాహం లభిస్తుంది. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. సొంతింటి ఆలోచనలు ఫలిస్తాయి. విద్యారంగంలో పనిచేసేవారికి పదోన్నతి సూచన. ప్రముఖులతో పరిచయం ఏర్పడుతుంది. దేవాలయాలు సందర్శిస్తారు.

## కర్కాటకం



సంఘంలో కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. శ్రమకు తగిన ప్రతిఫలం పొందుతారు. తీర్థ యాత్రలు చేస్తారు. ఆరోగ్య, ఆహార సలహాలు సూచనలు తప్పనిసరిగా పాటించండి. సన్నిహితుల సహకారంతో ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. భాగస్వామ్య వ్యాపారులకు లాభాలుంటాయి. వ్యవసాయ భూమి కొనుగోలు చేస్తారు. విద్యార్థులకు పోటీ పరీక్షల్లో విజయం.

## సింహం



వృద్ధుల ఆరోగ్యం మెరుగవుతుంది. నూతన వాహన యోగం. అనుకోని ధన లాభ సూచనలున్నాయి. ముఖ్యమైన నిర్ణయాలు అమలు పరుస్తారు. నూతన వ్యక్తులతో పరిచయం ఏర్పడుతుంది. శుభ కార్యాల్లో పాల్గొంటారు. ఆదాయానికి మించిన ఖర్చులున్నా సమయస్ఫూర్తితో వ్యవహరిస్తారు. కుటుంబ బాధ్యతలు తీరుతాయి. దేశాంతర ప్రయాణ సూచన.

## కన్య



విదేశీ ప్రయాణ సూచనలున్నాయి. ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. కుటుంబ బాధ్యతలు తీరుతాయి. విద్యార్థులకు శుభ యోగం. ఉద్యోగులకు అదనపు ఆదాయ మార్గాలు లభిస్తాయి. వృత్తి విద్యా కోర్సుల పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. క్రీడాకారులకు ప్రోత్సాహం లభిస్తుంది. గృహ రుణాలు తీర్చి ప్రశాంతత పొందుతారు. ప్రయాణం లాభిస్తుంది.

## తుల



వృథా ఖర్చులను నియంత్రిస్తారు. సాహిత్య సభల్లో పాల్గొంటారు. గతంలో ఆగిపోయిన పనులు వారాంతంలో పూర్తి చేస్తారు. వివాహ ప్రయత్నాలు ఫలిస్తాయి. అకారణంగా మానసిక వేదనకు లోనవుతారు. విదేశీ ప్రయాణ ప్రయత్నాలు ఒక కొలిక్కి వస్తాయి. ఉద్యోగులకు పనివత్తిడి ఉంటుంది. నూతన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. ఆరోగ్య సలహాలు, సూచనలు తూచా తప్పనిసరిగా పాటించండి.

## వృశ్చికం



దుర్వ్యసనాలకు దూరంగా వుండాలని స్వీయానుభవంతో తెలుసుకుంటారు. క్రయ-విక్రయాలు సామాన్యం. బ్యాంకు రుణాలు తీర్చడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. శుభ కార్య చర్చలు ఫలిస్తాయి. మీ శక్తి సామర్థ్యాలకు తగిన గుర్తింపు లభిస్తుంది. ఉద్యోగులకు స్థాన చలన సూచన. విదేశీ వస్తువులపై మక్కువ ఏర్పడుతుంది. ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు. ప్రముఖులతో పరిచయం.

## ధనుస్సు



వివాదాలు సమసిపోతాయి. వ్యవసాయ భూమి కొనుగోలు. పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. రియల్ ఎస్టేట్ రంగంలోని వారికి బాగుంటుంది. చిరకాల కోరిక నెరవేర్చుకుంటారు. శారీరక, మానసిక శ్రమకు లోనవుతారు. సంతానాభివృద్ధి గురించి చేసే చర్చలు ఫలిస్తాయి. నూతన వ్యక్తులతో పరిచయం ఏర్పడుతుంది. చిరు వ్యాపారులకు ఆసరా లభిస్తుంది. వృత్తి విద్యల పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. శత్రువులు మిత్రులవుతారు.

## మకరం



భూ వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. ఉద్యోగులకు పై అధికారుల ప్రశంసలు లభిస్తాయి. చోర భయం పొంచి వుంది. కనుక విలువైన పత్రాలు, వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండండి. తీర్థ యాత్రలు చేస్తారు. అన్ని వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరించడం చెప్పదగిన సూచన. విద్యార్థులు అధిక శ్రమ చేయాల్సి వస్తుంది. ఎదురు చూస్తున్న వర్తమానం వారాంతంలో అందుకుంటారు. వాహన యోగం.

## కుంభం



ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉద్యోగంలో ఒడుదుడుకులుంటాయి. అనుకోని ఖర్చులు వచ్చి పడతాయి. సంయమనం కోల్పోకండి. శత్రువులు మిత్రులవుతారు. సన్నిహితుల సహకారంతో స్వల్పకాలిక వ్యాపారం చేస్తారు. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. సోమరితనం దరి చేరనివ్వకండి. ఆరోగ్య సమస్యలను అలక్ష్యం చేయకండి.

## మీనం



విద్యార్థులకు శుభ యోగం. కుటుంబంలో ఐకమత్యం ఏర్పడుతుంది. అనుకోని సంఘటనలు జరిగినా ధైర్యంతో ఎదుర్కొంటారు. ఉద్యోగ ప్రయత్నం ఫలిస్తుంది. సంతానాభివృద్ధి ఆనందం కలిగిస్తుంది. శుభ కార్య చర్చలు ఫలిస్తాయి. విందు-వినోదాల్లో పాల్గొంటారు. అన్ని వ్యవహారాల్లో మీదే పై చేయిగా ఉంటుంది. వృద్ధాశ్రమాలకు ఆర్థిక సహాయం చేస్తారు. రియల్ ఎస్టేట్ రంగంలోని వారికి బాగుంటుంది.

# సరదాగా కాసేపు నవ్వుకోండి



## ముందు జాగ్రత్త

"మంచి టీచర్ కావాలంటే ఏం చెయ్యాలో కాస్త చెబుతారా?" వినమ్రతతో అడిగాడు ఆ రోజే ఉద్యోగంలో చేరిన అప్పారావు.
"అంటే ఏమిటయ్యా నీ ఉద్దేశం? పెద్ద టీచర్లు కూడా వుంటారా?" కోపంగా అడిగాడు సీనియర్ టీచర్ అయిన రామారావు.
"మీరు ఉన్నారు కదా సార్. నా ఉద్దేశంలో నేను మీలా కాకూడదనే ముందు జాగ్రత్త కోసం అడుగుతున్నాను సార్" అసలు సంగతి చెప్పాడు, అప్పారావు.

## గాడిద బొమ్మ

"ఎందుకండీ ఆ వంటిగాడిని అంతలా బాదుతున్నారు?" అడిగింది ఆండాళ్లు.
"వాడికి గాడిదబొమ్మ గియ్యమని టీచర్ చెప్పిందట. గాడిదను తెస్తే చూసి గీస్తానని అంటున్నాడు. వీడి దిక్కుమాలిన డ్రాయింగ్ కోసం నేను



గాడిదనెక్కడ నుంచి తెచ్చేది?" కోపంగా అరిచాడు వెంగళప్ప.
"ఓస్ అంతేనా? ఈ మాత్రం దానికి గాడిద ఎందుకు? ఒక్క అరగంట పాటు మీరే వాడి ఎదుట నిలబడి వాడి చేత గీయిస్తే పోలా? వయ్యారంగా మూతి తిప్పుకుంటూ వంటింట్లోకి వెళ్లిపోయింది ఆండాళ్లు.
భార్య మాటలకు నోరు తెరిచాడు వెంగళప్ప.

## పెళ్లి ఊసెత్తను..

"నాకిప్పుడు మూడో నెల. ఈ రోజు మా ఇంటికి వచ్చి నాన్నగారితో మన పెళ్లి విషయం మాట్లాడు" రిక్వెస్ట్ చేసింది లక్ష్మి.
"అలాగే.. తప్పకుండా వస్తాను" అన్నాడు గోపి.
"కానీ మా నాన్నగారి దగ్గర కట్నం ఊసెత్తవు కదా. కట్నం అంటేనే ఆయన అంతెత్తున ఎగురుతారు" అంది లక్ష్మి.
"ఏం పరవాలేదు. కట్నం సంగతేమిటి, అసలు పెళ్లి ఊసే ఎత్తను" పల్లీలు తింటూ భరోసా ఇచ్చాడు గోపి.

**- సిహెచ్.ప్రతాప్,** శ్రీకాకుళం

## పంటి డాక్టర్

ఇద్దరు వ్యక్తులు భీకరంగా పోట్లాడుకుంటున్నారు. అందులో మొదటి వ్యక్తి–
"నేను తలచుకున్నానంటే పళ్ల రాలగొడతాను" అన్నాడు.
రెండో వ్యక్తి: "ఏంటి? నువ్వేమన్నా పెద్ద రౌడీననుకుంటున్నావా?" అన్నాడు, కోపంగా.
మొదటి వ్యక్తి: "కాదు.. పంటి డాక్టర్‌ను'– అన్నాడు.
రెండో వ్యక్తి నివ్వెరపోయాడు.

**- టి.సదాశివ రెడ్డి,** తిరుపతి

## ఈత

రాము: ఈత కొట్టడానికి చెరువు దగ్గరకి వెళ్దామా?
శ్యామ్: వద్దురా.
రాము: నీకు ఈత అంటే ఇష్టమేగా.. ఎందుకు వద్దంటున్నావు?
శ్యామ్: రేపట్నుంచి భారీ వర్షాలట. రోడ్లన్నీ జలమయం అవుతాయి కదా. ఎంచక్కా రోడ్లమీదే ఈత కొట్టవచ్చు.

**- మా.శ్రీ.రాజు,** పాల్వంచ

టింగురోడు: డాక్టర్! మా నాన్నకు ఆయాసం, అమ్మకు నీరసం.. మంచి మందులు రాసివ్వండి.
తిక్కడాక్టర్: ఆయాసానికి పాయసం, నీరసానికి నిమ్మరసం వాడండి.
టింగురోడు: ఈ మందులు ఎక్కడ దొరకుతాయి డాక్టర్.
తిక్కడాక్టర్: స్వయంగా మీరు మీ ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు.

## గో....వా

కొడుకు: నాన్నా! నేను చెన్నై వెళ్తున్నా.
తండ్రి: న్యూస్ పేపర్ తిరగేస్తూ గోవా.
కొడుకు: గోవా కాదు నాన్నా.. చెన్నై వెళ్తున్నా.
తండ్రి: గో…వా.
కొడుకు: అమ్మా! నాన్నకు ఈ మధ్య బాగా చెవుడొచ్చినట్టుంది.
తల్లి: ఏమయిందిరా!
కొడుకు: చెన్నై వెళ్లొస్తానని ఎన్ని సార్లు చెప్పినా గోవా, గోవా అని అంటున్నాడమ్మా నాన్న.
తల్లి: ఓ అదా సంగతి. మీ నాన్న ఈ మధ్య ఇంగ్లీషు, తమిళం నేర్చుకుంటున్నాడు. గో అంటే ఇంగ్లీషులో పో.. వా అంటే తమిళలో రమ్మని అర్థం.
కొడుకు:.........పడిపోయాడు.

**- సంపంగివారి జయచంద్రారెడ్డి**

## జోక్స్‌కు ఆహ్వానం

మీరు పంపే జోక్స్ హాస్యాన్ని పండించేలా ఉండాలి.
కాపీ జోక్స్‌ను పంపకండి. చిరునామా:
ఎడిటర్, ఆదివారం వార్త, నం.396,
లోయర్ ట్యాంక్ బండ్, హైదరాబాద్–500 080
sunmagvaartha@gmail.com

## చిత్రభారతి



వాశిరాజు ప్రకాశం


# సినిమా విజేతలకు అభినందన స్వాగతం


**కాస్త** ఆలస్యంగా వెలుగు చూసినా 2020 సంవత్సరపు భారత జాతీయ చలన చిత్ర పురస్కారాలు పూదోటలో విసిరిన మందారాల్లా, తెలుగు సినిమా రంగాన్ని ఆనందంలో ముంచెత్తివేసింది. ఈ సంవత్సరం ఎంపిక చేసిన చలనచిత్ర విధానాలు ఏ దశలోను, ఏ భాషలోనూ రవ్వంతయినా వివాదాంశం కాకపోవటం మరీ ఆనందాన్నిచ్చింది. ఉత్తమ చలన చిత్రంగా 'కలర్‌ఫోటో' సినిమా విడుదలయిన రోజుల్లో ఈ చిత్రానికి రావలసినంత ప్రాముఖ్యం రాకపోవటానికి కారణం.. అదే కాలంలో తెలుగులో భారీ చిత్రాలు ఉప్పెనలా వువ్వెత్తున వెండితెరను అలరించాయి, కనకాభిషేకం చేశాయి. సందీప్ రాజ్ దర్శకత్వంలో తయారయిన 'కలర్‌ఫోటో'లో సుహాస్, చాందినీ ముఖ్య తారాగణంగా వారి వారి ప్రతిభకు తెలుగు ప్రేక్షకులు నివ్వెరపోయేలా ఆనందింపచేశారు. 'కలర్‌ఫోటో' ఒక అరుదయిన చిత్రం. కుల, మత భేదాలకు అతీతమైన సందేశాన్నిచ్చిన ఈ సినిమా నవరసాలు పలికించినా, ఎక్కడా పొరపాట్లు జరగ లేదన్న అంశాన్ని ఢిల్లీ అవార్డుల జ్యూరీ బాగా గ్రహించిందన్న వాస్తవానికి నిదర్శనం ఈ చిత్రానికి ఉత్తమ తెలుగు చిత్ర పురస్కార బహుమతి రావటమే. అలాగే కథా చిత్రానికి భిన్నంగా ప్రముఖ ప్రతిభా నర్తకి సంధ్యారాజు ఒక అద్భుతమైన ప్రయత్నం చేశారు. ఈ చిత్రానికి ఉత్తమ నాట్య ప్రతిభ అవార్డుతో పాటు మంచి మేకప్ అవార్డు కూడా రావటం అభినందనీయం. అలనాటి కూచిపూడి సంగీత గురువులు వెంపటి చినసత్యం గారి 'కూచిపూడి' కళా విన్యా సంలో చెరగని ముద్ర. ఇక మరో అవార్డు త్రివిక్రమ శ్రీనివాస్ దర్శకత్వంలో తయార యిన 'అలవైకుంఠపురంలో' చిత్రానికి ఉత్తమ సంగీతం అవార్డు వచ్చింది.




భారతదేశంలో ఉత్తమ చిత్రాలకు అవార్డులు యివ్వటం ఆరంభమై యాభై సంవత్సరాలు దాటింది. ఆ రోజుల్లో 1950 దశాబ్దంలో భారతీయ సినిమాలకు తప్పకుండా అవార్డులు యివ్వాలన్న గొప్ప భావన కలిగించిందన్న మహనీయుడు పండిట్ జవహర్‌లాల్ అయితే ఆ తరువాత తన మంత్రివర్గంలో సినిమా శాఖకు ఒక ప్రత్యేకమైన మంత్రిని నియమించి, ఈ శాఖ పురోగతికి జీవం పోశారు ఆయన. ప్రతి అవార్డుతోను కొద్దిపాటి పారితోషికంతో ఆరంభమైన భారతీయ సినిమా ఆ రోజుల్లో ఇరవై అవార్డులతో ఆరంభమై ఈ సంవత్సరం 2022కు ఏభై విభాగాలకు చేరింది. చిన్న చిన్న శాఖలను ఈనాటి ప్రభుత్వం మరిచిపోకుండా, సినీ పత్రికా రచనకు సైతం ఏటా మూడు అవార్డులు యివ్వటంతో సినిమాతల్లి మురి సింది. ఈ సంవత్సరం యిచ్చిన అవార్డు లకు భారీ ఎత్తున వ్యయం తప్పనిసరైంది. అందుకు కారణం.. అవార్డు విజేతలకు ఫైవ్ స్టార్ మర్యాదలతో న్యూఢిల్లీ అశోకా హోటల్‌లో ఆతిథ్యం యివ్వటం అదో హోదా, అదో గర్వకారణం. ఈనాటి అవా ర్డులను న్యూఢిల్లీ విజ్ఞాన్‌భవన్‌లో దాదాపు రెండున్నర గంటల సమయం అంద చేస్తారు. ఇవన్నీ రాష్ట్రపతిగారే స్వయంగా ఇవ్వటం, గ్రహీతలకు మరపురాని అనుభూతి. ఈ అవార్డులకు తలమాని కంగా ఏటా 'దాదాసాహెబ్ ఫాల్కే' అవార్డును అందచేస్తూ భారతీయ సినిమా తన గౌరవాన్ని అత్యధికంగా యినుమడిం పచేసుకుంది. ఈ ఫాల్కే అవార్డును గత సంవత్సరం కళాతపస్వి కె.విశ్వనాథ్ గారికి రాష్ట్రపతి అందించిన వేళ విజ్ఞాన్‌భవన్ అతిథులకు అందరూ వినయ వినమ్రతతో లేచి నిలబడి హర్షధ్వానాలు చేయటం ఈ గౌరవం శ్రీ విశ్వనాథ్‌గారు తన అజరామర కృషితో, ప్రతిభతో యాభై ఏళ్ల నిరంతర సృజనతో పోగు చేసుకున్న హిమాలయం. అది ఆయనకే చెల్లింది.

ఇన్నేళ్ల కాలంలో ఏటా యిచ్చిన అవార్డులలో తొలి సంవత్సరం యిచ్చిన మూడు నంది అవార్డులు రాను రాను ముప్పై అవార్డులుగా మారాయి. ఈ నందులు యిటీవలి కాలంలో కాస్త మౌనం గా, రాను రాను యివి మళ్లీ వేగం పుంజు కుంటాయని అందరికీ ఆశ. కారణం.. మన ముఖ్యమంత్రి స్వయంగా సినిమా అభిమాని, లలిత కళల బాంధవుడు. అందుకే ఆయన సినిమా రంగానికి కొత్త వెలుగు యిస్తారు. ఇక యిన్నేళ్లలో తెలుగు సినిమా రంగానికి వేయి దీపాల కాంతులై వెలిగించిన చిత్రాలు ఎన్నో వున్నాయి. తొలి దశలో సంచలనం సృష్టించిన 'దేవదాసు', 'నర్తనశాల', 'మూగమనసులు', 'దొంగరాముడు', 'పెద్దమనుషులు' లాంటివి ప్రేక్షకులను ఆనందపరిస్తే యింకా ముందు కు వెళ్లి తెలుగు సినిమా చరిత్రను తిరగరా సిన చిత్రం లలితా శివజ్యోతివారి 'లవకుశ'. ఈ సినిమా విడుదలయిన ప్రతి కేంద్రం లోను వంద రోజులు ఆడిన చిత్రాన్ని చూసి ఆయా పాత్రల వైభవానికి పరిమళ కాంతులతో పంచిపెట్టారు. ఉత్తరాదిన పౌరాణిక చిత్రాలు తీస్తున్నవారు తెలుగునే లకు చేరి, రామాయణ పాత్రలకు నుదుట కుంకుమ దిద్దారు. రాముడంటే యిలా వుండాలి.. సీతమ్మతల్లి ఇలా వుండాలి.. అన్న ఆనాటి చెరగని ముద్రలు వేసిన 'లవకుశ' యిప్పటికీ భారతీయ సినిమా ఇంటింటి పచ్చ తోరణం. ❏


మూన్నెళ్ళ పాల బిల్లా..? అయ్యో.. రాత్రే ఇనకం టాక్సు వాళ్ళు యాభై కోట్లు సీజ్ చేసి తీసుకెళ్ళారు...!!
Zakir...


'ఈ' అన్నా.. 'ఊ' అన్నా అలిగి వెళ్తున్నారు...
నాకేదో అనుమానంగా ఉందండీ..!!
Zakir...


ఏంటి వదిన..మీ యింట్లో ఒక్క బల్లికే తోక లేదు.. అన్ని అప్పులున్నాయా..?!
బల్లి తోక జిల్లేడు చెట్టుకు కడితే అప్పులు మాయం
Zakir...

ఈ కా రం గా 'ర్యా' న్స్

ఫోటో ఫీచర్



పోర్చుగల్‌లోని అగ్యుడా నగరంలో ప్రతి సంవత్సరం అగ్యుడా అగితాగ్యుడా ఆర్ట్ ఫెస్టివల్ సమయంలో వీధుల్లో రంగు రంగుల, అందమైన గొడుగులు వేలాడదీస్తారు. పర్యాటకులను ఆకర్షించేందుకు గొడుగులను ఇలా అలంకరిస్తారట. అధిక సంఖ్యలో పర్యాటకులు సందర్శిస్తారట.







